PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 102, పేజీలు - 08

సోమవారం,అక్టోబర్ 12, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD



**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం









# పాతాళానికి భూగర్భ జలాలు..

## గతేడాది కంటే మరింత లోతుకు నీటిమట్టం

- గతేడాదితో పోలిస్తే 6.85 మీటర్ల లోతుకు పడిపోయిన నీటిమట్టాలు
- నగరంలో 76 శాతానికిపైగా ప్రాంతాల్లో 10 మీటర్ల దిగువకు జలాలు
- రోజుకు 5,500కు చేరిన వాటర్ ట్యాంకర్ల బుకింగ్‌లు.. భవిష్యత్తుపై ఆందోళన

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మహానగరంలో భూగర్భ జలాల పరిస్థితి రోజురోజుకూ ఆందోళనకరంగా మారుతోంది. నైరుతి రుతుపవనాల సీజన్ ముగిసినా ఆశించిన స్థాయిలో నీటిమట్టాలు పెరగకపోగా, గతేడాదితో పోలిస్తే మరింత లోతుకు పడిపోయాయి. గత సెప్టెంబర్ చివరితో పోలిస్తే ఈ ఏడాది భూగర్భ జలమట్టాలు ఏకంగా 6.85 మీటర్ల మేర దిగజారడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో బోర్లు నీరందించలేని పరిస్థితులు నెలకొనగా, నీటి అవసరాల కోసం ట్యాంకర్లపై ఆధారపడుతున్న కుటుంబాల సంఖ్య పెరుగుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న రోజుల్లో నగరం తీవ్ర నీటి సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

### 10 మీటర్ల దిగువకు నీటిమట్టాలు

హైదరాబాద్‌లో భూగర్భ జలాల పతనం గణాంకాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ప్రస్తుతం నగరంలో సగటు భూగర్భ జలమట్టం 11.58 మీటర్ల లోతులో నమోదవుతోంది. నగర పరిధిలోని 76 శాతానికిపైగా ప్రాంతాల్లో నీటిమట్టాలు 10 మీటర్ల కంటే

2లో..

## దేశ గొంతుకను అణగదొక్కలేరు

### - సుప్రీం మార్చ్ రావాలని రాహుల్ గాంధీ పిలుపు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని, 'ఓట్ల చోరీ' జరుగుతోందని ఆరోపిస్తున్న ప్రతిపక్షాలు తమ పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేశాయి. ఈ అంశాలపై భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) దృష్టికి తీసుకెళ్లేందుకు సోమవారం సుప్రీంకోర్టుకు మార్చ్ నిర్వహించనున్నట్లు ప్రకటించాయి. ఈ మార్చ్‌లో ప్రజలందరూ పాల్గొనాలని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. "ఓట్ల చోరీకి ముగింపు పలకాలని, ఎలక్టోరల్ రోల్స్, ఈవీఎంలకు సంబంధించిన ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని, అలాగే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశం తరఫున సీజేఐ సూర్యకాంత్‌కు వినతిపత్రం సమర్పిస్తాం" అని రాహుల్ గాంధీ ఆ వీడియోలో తెలిపారు.

2లో..

## హైదరాబాద్ డ్రగ్స్‌కు మూలం గోవానే

### - సీఎం ప్రమోద్ సావంత్ లక్ష్యంగా ఆరోపణలు

- హైదరాబాద్‌లో పట్టుబడిన డ్రగ్స్‌కు మూలం గోవానేనని ఆరోపణ
- భూములను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని మండిపాటు
- గోవాను కాపాడుకోవడానికి కాంగ్రెస్ అధికారంలోకి రావాలని పిలుపు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** గోవాలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా పెరుగుతోందని, ఈ సమస్యను అరికట్టడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. హైదరాబాద్‌లో పట్టుబడుతున్న డ్రగ్స్‌కు గోవా కేంద్రంగా ఉందని ఆయన ఆరోపించారు. గోవాలో పర్యాటక రంగానికి మంచి గుర్తింపు ఉన్నప్పటికీ, డ్రగ్స్ కారణంగా రాష్ట్ర ప్రతిష్ఠ దెబ్బతింటోందని వ్యాఖ్యానించారు. ఆదివారం గోవాలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన 'గోయ్ రాభోన్న్' పాదయాత్రలో రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ గోవాలో మాదకద్రవ్యాల సమస్యను పరిష్కరించేందుకు బీజేపీ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ప్రశ్నలు సంధించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు హైదరాబాద్‌లో డ్రగ్స్ వ్యవహారాలు ఎక్కువగా కనిపించేవని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రత్యేకంగా ఈగల్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డ్రగ్స్ సరఫరా, వినియోగాన్ని

2లో..

## ఓటు కోల్పోయిన వారిని తీసుకొస్తా, డేట్ ఫిక్స్ చెయ్

### - రాంచందర్‌రావుకు మంత్రి పొన్నం ఛాలెంజ్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో ఓటర్ల జాబితా సవరణ పేరుతో భారీగా ఓట్లు తొలగిస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఫైర్ అయ్యారు. ఓటర్ల తొలగింపుపై ప్రశ్నిస్తున్న వారిని అరెస్టులు చేయడం, అవమానించడం తగదన్నారు. ఈ విషయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుకు

2లో..

## స్థానిక ఎన్నికల్లో బీసీలకు 40 శాతం సీట్లు

### - ట్రిపుల్ ఇంజిన్ సర్కార్‌పై చంద్రబాబు ధీమా

- బీసీ రిజర్వేషన్లను తగ్గించి వైసీపీ అన్యాయం చేసిందని విమర్శ
- విజయవాడ శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని అధికారులకు ఆదేశం
- పేదలకు శాశ్వత ఇంటి పట్టాల పంపిణీ ఒక ఉద్యమంలా కొనసాగుతోందని వెల్లడి
- స్థానిక ఎన్నికల విజయంతో ట్రిపుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటు చేస్తామని ధీమా



**అమరావతి (ప్రశ్న న్యూస్)** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన వర్గాలకు (బీసీలకు) తెలుగుదేశం పార్టీ తరఫున 40 శాతం వరకు సీట్లు కేటాయించనున్నట్లు పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. ఈ ఎన్నికల ఫలితాల ఆధారంగానే పార్టీ నాయకుల పనితీరును అంచనా వేస్తామని స్పష్టం చేశారు. టీడీపీ సీనియర్ నాయకులతో నిర్వహించిన వర్చువల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర జనాభాలో దాదాపు సగం ఉన్న బీసీల సంక్షేమం పట్ల తమ ప్రభుత్వానికి పూర్తి చిత్తశుద్ధి ఉందని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించి తీవ్ర అన్యాయం చేసిందని చంద్రబాబు ఆరోపించారు. రిజర్వేషన్లు అందకుండా అడ్డుకోవడానికి, ఎన్నికలను వాయిదా వేయడానికి వైసీపీ కోర్టు మెట్లెక్కిందని విమర్శించారు. వైసీపీ హయాంలో బీసీలకు జరిగిన అన్యాయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. అభ్యర్థుల ఎంపికలో గెలుపు అవకాశాలు, నిజాయతీ, సామాజిక సమతుల్యతకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.

2లో..

## తెలంగాణలో సాగు, తాగునీటి కష్టాలు

### - యాసంగి పంటలు వేయొద్దని సర్కార్ విజ్ఞప్తి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో ఎల్‌నినో ప్రభావంతో రానున్న నెలల్లో వర్షాభావ పరిస్థితులు తీవ్రమయ్యే ప్రమాదం ఉందని రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. తాగునీరు, సాగునీరు, విద్యుత్ సరఫరాపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉండటంతో రైతులు యాసంగి పంటల సాగుపై ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలను కాపాడేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అయితే భవిష్యత్తులో నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని రెండో పంట వేయకుండా సహకరించాలని కోరారు. ఖమ్మం జిల్లాలోని పాలేరు నియోజకవర్గంలో పర్యటించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎల్‌నినో పరిస్థితుల కారణంగా రాబోయే రోజుల్లో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవచ్చని పేర్కొన్నారు. దీంతో వ్యవసాయానికి అవసరమైన నీటితో పాటు ప్రజల తాగునీటి అవసరాలను తీర్చడం కూడా సవాలుగా మారే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే సాగు చేసిన పంటలకు సాధ్యమైనంత వరకు నీరు అందించి వాటిని కాపాడేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. రెండో పంట వేసి, ఆ తర్వాత నీరు అందక పంటలు ఎండిపోతే రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని మంత్రి హెచ్చరించారు. అందువల్ల పరిస్థితులను అర్థం చేసుకుని యాసంగి సాగు విషయంలో ప్రభుత్వ సూచనలను పాటించాలని కోరారు.

2లో..

## స్థానిక ఎన్నికల్లో జనసేనను గెలిపించండి

### - 2024లో జనసేన చాలా త్యాగం చేసిందన్న పవన్



**అమరావతి (ప్రశ్న న్యూస్)** అడవితల్లి బాట 2.0 కార్యక్రమాన్ని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదివారం నాడు ప్రారంభించారు. అడవి బిడ్డల కష్టాలు తెలుసుకునేందుకు పోలవరం ఏజెన్సీ గ్రామానికి వెళ్లారు. సుమారు 350 మంది జనాభా కలిగిన రాకోట గ్రామాన్ని సందర్శించి, గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చింత చెట్టు కింద కూర్చుని వారితో ప్రత్యేకంగా మాట్లాడారు. గిరిజనులు ప్రస్తావించిన సమస్యలపై తక్షణమే స్పందించి, పరిష్కారాలకు అధికారుకు పవన్ కళ్యాణ్ ఆదేశాలు జారీ చేశారు.

**గతంలో చాలా త్యాగాలు చేశాం, ఈసారి జన సైనికులకు మద్దతు తెలపండి**

పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ

2లో..

## ఇప్పుడున్నది ఎమర్జెన్సీ కాదు, ముందు జాగ్రత్త చర్యలే

### - ప్రజాస్వామ్యంపై పాఠాలు చెప్పే అర్హత కాంగ్రెస్‌కు లేదు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) నిజమైన ఎమర్జెన్సీ అంటే ఏమిటో, ఆ సమయంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడ్డారో రాహుల్ గాంధీ ముందుగా తెలుసుకోవాలని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి హితవు పలికారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్ష బీజేపీని ఎలా అణచివేస్తోందో స్వయంగా చూడటానికి రావాలని ఆయన రాహుల్‌ను ఆహ్వానించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న ఆంక్షలను, 1975లో

2లో..

## ఢిల్లీలో బారికేడ్లు తొలగించండి, మెట్రో నడపండి

### - ఇంటర్నెట్‌పై ఆంక్షలు వద్దన్న సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశ రాజధాని ఢిల్లీలో నిరసనల నేపథ్యంలో విధించిన కఠిన ఆంక్షలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. శాంతిభద్రతలు లేదా ట్రాఫిక్ సమస్యలు ఉంటే తప్ప, మిగతా అన్ని చోట్లా ఏర్పాటు చేసిన బారికేడ్లను సమీక్షించి తొలగించాలని అధికారులను ఆదేశించింది. మెట్రో, రైల్వే సేవలను యథాతథంగా కొనసాగించాలని, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అత్యవసరమైతే తప్ప వాటిని నిలిపివేయరాదని నేడు జరిగిన ప్రత్యేక విచారణలో స్పష్టం చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు సంబంధించిన డిమాండ్లతో నిన్న ఢిల్లీలో జరిగిన నిరసనల

2లో..

ప్రజాప్రశ్న



# పాతాళానికి భూగర్భ జలాలు..

## హైదరాబాద్‌కు జలగండం!

ఎక్కువ లోతుకు పడిపోయాయి. కేవలం 24 శాతం ప్రాంతాల్లో మాత్రమే 10 మీటర్లు లేదా అంతకంటే తక్కువ లోతులో నీరు అందుబాటులో ఉంది. ఆగస్టుతో పోల్చినా సెప్టెంబర్ చివరి నాటికి నీటిమట్టాలు మరింత తగ్గడం గమనార్హం. దీంతో బోర్ల ద్వారా నీటిని పొందడం కష్టతరమవుతోంది.

### వర్షపాతం లోటుతో మరింత క్షీణత

హైదరాబాద్ పట్టణ ప్రాంత అభివృద్ధి పరిధి (క్యూర్)లోని 49 మండలాల్లో వర్షపాతం లోటు భూగర్భ జలాల పునరుద్ధరణపై ప్రభావం చూపుతోంది. సెప్టెంబర్ చివరి నాటికి సాధారణంగా 619 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 457 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో భూగర్భ జలాల పెరుగుదలకు ఆటంకం ఏర్పడింది. ఆగస్టుతో పోలిస్తే సెప్టెంబర్ చివరికి నీటిమట్టాలు మరో 0.38 మీటర్లు తగ్గాయి.

### ఈ ప్రాంతాల్లో తీవ్ర ప్రభావం

కూకట్‌పల్లి, అమీర్‌పేట, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, శంకర్‌పల్లి, కేపీహెచ్‌బీ, కుత్బుల్లాపూర్, సరూర్‌నగర్, జీడిమెట్ల, ఎస్సార్‌నగర్, దుండిగల్, చెంగిచెర్ల, ఫతుల్లాగూడ, హాఫీజ్‌పేట, రామంతాపూర్ తదితర ప్రాంతాల్లో భూగర్భ జలాలు గణనీయంగా తగ్గాయి. బోర్లపై ఆధారపడే కుటుంబాలు నీటి లభ్యతపై ఆందోళన చెందుతున్నాయి. అపార్ట్‌మెంట్లు, నివాస సముదాయాల్లో నీటి సరఫరా నిర్వహణ సవాలుగా మారుతోంది.

### ట్యాంకర్ల బుకింగ్‌ల్లో భారీ పెరుగుదల

భూగర్భ జలాల పతనం ప్రభావం జలమండలి ట్యాంకర్ల బుకింగ్‌లపై స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణంగా అక్టోబర్ మొదటి వారంలో రోజుకు 3,000 నుంచి 3,500 ట్యాంకర్లు బుక్ అవుతుండగా, ప్రస్తుతం ఈ సంఖ్య సగటున 5,500కు చేరింది. కొన్ని రోజుల క్రితం ఏకంగా 6,500 ట్యాంకర్ల వరకు బుకింగ్‌లు నమోదయ్యాయి. ఈ గణాంకాలు నగరంలో నీటి అవసరాలు ఎంతగా పెరుగుతున్నాయో తెలియజేస్తున్నాయి.

### ఇప్పటికైనా మేల్కొనాలి

భూగర్భ జలాలపై ఒత్తిడిని తగ్గించేందుకు వర్షపు నీటి సంరక్షణ, ఇంకుడు గుంతల ఏర్పాటు, నీటి వృథాను అరికట్టడం వంటి చర్యలు అత్యవసరంగా మారాయి. భవనాలు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాల్లో వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలి. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి. ప్రభుత్వ సంస్థలు, ప్రజలు సమన్వయంతో భూగర్భ జలాల పునరుద్ధరణకు కృషి చేయాలి. ఇప్పటి నుంచే సమర్థవంతమైన చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో హైదరాబాద్ మహానగరంలో నీటి సంక్షోభం మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది.

# దేశ గొంతుకను అణగదొక్కలేరు

"భయపడొద్దు. ప్రేమ, సోదరభావం, దేశభక్తితో కలిసి నడుద్దాం. రేపు యావత్ భారతదేశం సుప్రీంకోర్టుకు కదులుతుంది" అని ఆయన అన్నారు.మరోవైపు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా దేశంలో గందరగోళం, భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. సీజేఐ అపాయింట్‌మెంట్ కోరుతూ తాను, రాహుల్ గాంధీ లేఖలు రాసినట్లు ఖర్గే వెల్లడించారు. సోమవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య సమయం కోరినట్లు తెలిపారు. శనివారం ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలిపిన యువతపై పోలీసులు, బీజేపీ గూండాలు దాడి చేశారని రాహుల్ గాంధీ ఆరోపించారు. నరేంద్ర మోదీ, అమిత్ షా, అజిత్ దోవల్, మోహన్ భగవత్ వంటి వారు భారత ప్రజల గొంతు నొక్కలేరని, వారి పిరికిపంద చర్యలకు భయపడేది లేదని రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ మార్చ్‌లో యువత, ప్రతిపక్ష పార్టీలు, పౌర సమాజ బృందాలు, ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

# స్థానిక ఎన్నికల్లో బీసీలకు 40 శాతం సీట్లు

మరోవైపు, విజయవాడలో జరగనున్న శరన్నవరాత్రి ఉత్సవాలు, అభివృద్ధి పనులపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి వేడుకలను విజయవంతం చేయాలని, విజయవాడ ఉత్సవ్ 2.0ను ఘనంగా నిర్వహించాలని దేవాదాయ, పర్యాటక శాఖలను, జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. "అడవి తల్లి బాట" తొలి దశలో 1,976 కిలోమీటర్ల రహదారుల నిర్మాణం పూర్తి కావడం పట్ల జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను అభినందించారు. రాష్ట్రవ్యాప్తంగా పేదలకు శాశ్వత ఇంటి పట్టాల పంపిణీ ఒక ఉద్యమంలా సాగుతోందని చంద్రబాబు అన్నారు. విజయవాడ జాఫర్ సాహెబ్ కాలువ ప్రాంత వాసులకు పట్టాలు ఇవ్వాలని నిర్ణయించామని, సంక్రాంతికి నెల్లూరులో మరో 4,000 మందికి పట్టాలు అందిస్తామని తెలిపారు. ప్రస్తుతం కేంద్రం, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉందని, స్థానిక ఎన్నికల్లో గెలిచి ట్రిపుల్ ఇంజిన్ సర్కార్‌ను ఏర్పాటు చేయడమే లక్ష్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మిత్రపక్షాలైన టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య సమన్వయంతో పనిచేసి స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలని సూచించారు. "ఆరోగ్యవంతమైన, సంపన్న, సంతోషకరమైన ఆంధ్రప్రదేశ్" నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు.

# ఓటు కోల్పోయిన వారిని తీసుకొస్తా, డేట్ ఫిక్స్ చెయ్

బహిరంగ సవాల్ విసిరారు.

### బాధితులను మీ ముందే నిలబెడతాం

"ఓటు హక్కు కోల్పోయిన వారు ఎవరైనా ఉన్నారా అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు ప్రశ్నించడం సరికాదు. పోలీసులతో అరెస్టులు చేయించడం కాకుండా ఆయన తేదీ, సమయం ప్రకటిస్తే ఓటు హక్కు కోల్పోయి ఆందోళన చెందుతున్న బాధితులను ఆధారాలతో సహా ఆయన ముందుకు తీసుకొస్తాను" అని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా సవరణలో జరిగిన పొరపాట్లపై బాధితులకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు.

### ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ఓట్లపై కుట్ర

ఓటర్ల జాబితా సవరణ(సర్) ప్రక్రియ పారదర్శకంగా జరగడం లేదని మంత్రి ఆరోపించారు. దేశవ్యాప్తంగా దాదాపు 13 కోట్ల ఓట్లు, హైదరాబాద్‌లోనే 40 లక్షలు, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సవరణ పేరుతో 70 లక్షల ఓట్లు తొలగించారని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీకి వ్యతిరేకంగా ఉండే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ఓట్లను తొలగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. రోజువారీ కూలీలు, నిరక్షరాస్యులు, వృద్ధులు ఆధార్ కార్డులు ఉన్నప్పటికీ తమ ఓటు హక్కును నిరూపించుకోవడానికి ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. తన సొంత ఓటు విషయంలోనూ తండ్రి పేరు (సత్తయ్య / సత్యనారాయణ గౌడ్) తేడా సాకుగా చూపి తొలగించే ప్రయత్నం జరిగిందని మంత్రి గుర్తుచేశారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సైతం గతంలో ఓటరు నమోదు, ఆధారాల సమర్పణపై ఎదురైన ఇబ్బందులను ప్రస్తావించారని, సామాన్యుల పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు.

### ఓటు బచావో - దేశ్ బచావో

స్వాతంత్ర్యం వచ్చిన 80 ఏళ్ల తర్వాత ప్రజలు తమ రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును కాపాడుకోవడానికి పోరాడాల్సిన పరిస్థితి రావడం విచారకరమని మంత్రి పొన్నం అన్నారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా తన హక్కును కోల్పోకూడదని డిమాండ్ చేస్తూ, "ఓటు బచావో - దేశ్ బచావో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకుందాం" అనే నినాదంతో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.

# ఢిల్లీలో బారికేడ్లు తొలగించండి, మెట్రో నడపండి

సందర్భంగా అధికారులు భారీ ఆంక్షలు విధించారు. పలు మెట్రో స్టేషన్లను మూసివేయడం, నిరసనకారులను అక్రమంగా అదుపులోకి తీసుకున్నారన్న ఆరోపణలపై సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఆదివారం ప్రత్యేకంగా విచారణ చేపట్టింది.ఈ సందర్భంగా ధర్మాసనం పలు కీలకమైన మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. చట్టబద్ధమైన నిబంధనలకు లోబడి ప్రజలు, వాహనాల స్వేచ్ఛాయుత రాకపోకలకు అనుమతించాలని స్పష్టం చేసింది. చట్ట ప్రకారం కాకుండా ఇంటర్నెట్ సేవలకు ఎలాంటి అంతరాయం కలిగించరాదని తేల్చి చెప్పింది. నిర్దిష్ట ప్రాంతాల్లో ఆంక్షలు విధించిన చోట మినహా, శాంతియుతంగా సమావేశమయ్యే వారిని అక్రమంగా నిర్బంధించకూడదని ధర్మాసనం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తన వాదనలు వినిపించింది. ఢిల్లీలో ఇంటర్నెట్ సేవలను ఇప్పటికే పునరుద్ధరించామని, మెట్రో కార్యకలాపాలు కూడా పూర్తిగా సాధారణ స్థితికి వచ్చాయని కోర్టుకు తెలియజేసింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, మెట్రో స్టేషన్ల మూసివేతపై వ్యక్తమైన ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని దీనిపై మరిన్ని వివరాలు సమర్పించాలని కోరుతూ తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

# హైదరాబాద్ డ్రగ్స్‌కు మూలం గోవానే

అరికట్టేందుకు తమ ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నషా ముక్త్ భారత్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో గోవాలో ఆ లక్ష్యాన్ని ఎందుకు అమలు చేయడం లేదని గోవా సీఎం ప్రమోద్ సావంత్‌ను రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కేంద్రంలోనూ, గోవాలోనూ బీజేపీ ప్రభుత్వాలే ఉన్నాయని గుర్తుచేశారు. డ్రగ్స్ అక్రమ రవాణాను నియంత్రించడంలో ఎదురవుతున్న వైఫల్యాలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. డ్రగ్స్ సమస్యతో పాటు ప్రభుత్వ భూముల కేటాయింపులు, పర్యావరణ పరిరక్షణ అంశాలపైనా బీజేపీ ప్రభుత్వాన్ని ఆయన విమర్శించారు. గోవా ప్రజల ప్రయోజనాలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. త్వరలో జరగనున్న గోవా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తప్పక విజయం సాధిస్తుందని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్ర ప్రజలకు మెరుగైన పాలన అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# స్థానిక ఎన్నికల్లో జనసేనను గెలిపించండి

'ఈసారి జనసేన పొత్తు ప్రకారం పోటీ చేస్తుంది. స్థానిక ఎన్నికల్లో జనసైనికులను గెలిపించండి. కూటమిలోని టీడీపీ, బీజేపీని ఎలా ఆదరిస్తారో, గౌరవిస్తారో అదే తీరుగా జనసేనకు మద్దతు తెలపండి. 2023లో చంద్రబాబును అరెస్ట్ చేసి రాజమండ్రి జైల్లో పెట్టినప్పుడు ఎవరూ బయటకు రానప్పుడు జనసైనికులు, జనసేన వీర మహిళలు ధైర్యంగా రోడ్ల మీదకు వచ్చి భరోసా ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర భవిష్యత్ కోసం కలిసి పోరాటం చేశాం. ఇప్పుడు స్థానిక ఎన్నికలు మీ భవిష్యత్ కోసం, మీ స్థానిక అవసరాల కోసం జరుగుతున్నాయి. మూడు పార్టీలు బాగుండాలి. గత ఎన్నికల్లో జనసేన చాలా త్యాగాలు చేసింది. ఈసారి స్థానిక ఎన్నికల్లో జనసైనికులు, వీరమహిళలకు మద్దతు తెలపాలని' ప్రజలను కోరారు.

### చింతచెట్టు కింద గిరిపుత్రులతో మాటా మంతి

'అడవితల్లిబాట 2.0' కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు పోలవరం జిల్లా పరిధిలోని రంపచోడవరం నియోజకవర్గం, వేములకొండ గ్రామ పంచాయతీ పరిధిలోని రాకోట గిరిశిఖర గ్రామానికి పవన్ కళ్యాణ్ వెళ్లారు. అదే పంచాయతీ పరిధిలోని కాకవాడ, రాకోట, సువర్లవాడ, వేములకొండ గ్రామాలను కలిపేలా రూ. 2.29 కోట్ల వ్యయంతో 3.4 కిలోమీటర్ల మేర రోడ్లకు శంకుస్థాపన చేశారు. రాకోట గ్రామంలో చింతచెట్టు కింద ఉన్న రచ్చబండ వద్ద గిరిపుత్రులతో 'మాటా మంతి' కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.

### స్కూల్, ఆరోగ్య కేంద్రం, ఆలయ అభివృద్ధికి నిధులు

రాకోట గ్రామంలో ఎంపీపీ పాఠశాల శిథిలావస్థలో ఉన్న విషయాన్ని తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి దాని పునరుద్ధరణకు రూ. 20 లక్షలు మంజూరు చేశారు. గ్రామస్థుల కోరిక మేరకు విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణానికి రూ. 15 లక్షలు మంజూరు చేశారు. రాకోట గ్రామస్థులతో పూజలందుకుంటున్న హనుమాన్ ఆలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రేకుల షెడ్డులో కొనసాగుతున్న ఆలయ పరిస్థితిని గమనించిన పవన్ కళ్యాణ్ దేవాదాయ శాఖ సహకారంతో భజన మందిరంగా అభివృద్ధికి మరో 20 లక్షలు కేటాయించారు.

### గిరిజన గ్రామాల సమస్యలకు తక్షణ పరిష్కారాలు

రాకోట పరిసర ప్రాంతాలైన వేములకొండ, సువర్లవాడ, డబ్బావలస, తిరుగటిరాళ్లు, కాకవాడ, చిలకవీధి, వెట్టిచెలకలు, సోకులగూడెం గ్రామాల ప్రజలు తమ సమస్యలను పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకొచ్చారు. వాటిపై ఆయన తక్షణమే స్పందించారు. ప్రతి గ్రామానికి అంగన్‌వాడీ కేంద్రంతో కూడిన మండల పరిషత్ పాఠశాల, విలేజ్ హెల్త్ క్లినిక్ మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ అభివృద్ధి పనుల కోసం వివిధ పథకాల ద్వారా దాదాపు 5 కోట్లు కేటాయించారు. గిరిజనులు తమ సమస్యలను స్వయంగా ఉప ముఖ్యమంత్రివర్యుల దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేయడంతో గిరిపుత్రుల్లో భరోసా నింపారు.

### డిప్యూటీ సీఎంకు ఘన స్వాగతం పలికిన గిరిజనులు

తమ గ్రామానికి వచ్చిన పవన్ కళ్యాణ్ కు రాకోట గ్రామ గిరిజన మహిళలు ఘనస్వాగతం పలికారు. గిరిజన సంప్రదాయాలు పాటిస్తూ స్థానికంగా లభించే పూలతో తయారు చేసిన బొకేలను అందజేసి పూల వర్షం కురిపిస్తూ గ్రామంలోకి ఆహ్వానించారు.

### మండల పరిషత్ పాఠశాల భవనం పరిశీలన

రాకోట గ్రామానికి చేరుకున్న వెంటనే పక్కనే ఉన్న ఎంపీపీ పాఠశాలను పవన్ కళ్యాణ్ పరిశీలించారు. చిన్నారులను పలకరించి, పాఠశాల భవనాలతో పాటు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉద్యానవనాన్ని సందర్శించారు. పాఠశాల భవనం మరమ్మతుల కోసం రూ. 20 లక్షలు కేటాయించారు. విద్యార్థులకు తినుబండారాలు అందించారు.

### వెదురు ఉత్పత్తుల విలువ పెంపునకు సహకారం

అనంతరం రాకోట గ్రామంలో వెదురు బొంగులతో గృహోపకరణాలు తయారు చేస్తున్న కొమ్మిరెడ్డి కుటుంబాన్ని పలకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సెర్ప్ ఆధ్వర్యంలో వెదురు ఉత్పత్తుల ప్రోత్సాహానికి తీసుకుంటున్న చర్యలను అధికారులు వివరించారు. వెదురు ఉత్పత్తులకు మరింత విలువ జోడించి, గిరిజన కుటుంబాలకు మెరుగైన ఆదాయం లభించేలా ప్రభుత్వం తరఫున సహకారం అందిస్తామని ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు.

### వ్యవసాయదారులకు పనిముట్ల పంపిణీ ప్రారంభం

కాకవాడ గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు ముందు ప్రధానమంత్రి కృషి సించాయి యోజన 2.0 పథకం కింద వాటర్‌షెడ్ అభివృద్ధి పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ. 68 కోట్ల వ్యయంతో 34 వేల మంది అర్హులైన రైతులకు వ్యవసాయ పనిముట్లు అందించే కార్యక్రమంలో భాగంగా స్థానిక గిరిజన రైతులకు పరికరాలను పంపిణీ చేశారు.

## ఇప్పుడున్నది ఎమర్జెన్సీ కాదు,

# ముందు జాగ్రత్త చర్యలే

ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీతో విపక్షాలు పోల్చడంపై కిషన్ రెడ్డి స్పందించారు. ఇవి ఎమర్జెన్సీ కాదని, దేశంలో అశాంతి సృష్టించేందుకు కొన్ని దేశ వ్యతిరేక, అంతర్జాతీయ శక్తులు ప్రయత్నిస్తున్నాయని, అందుకే ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. విపక్షాలు లేనిపోని సమస్యలను సృష్టించి వ్యవస్థను దెబ్బతీయాలని చూస్తున్నాయని ఆయన ఆరోపించారు.ప్రజాస్వామ్యం పేరుతో కాంగ్రెస్ పార్టీ తమకు నీతులు చెప్పాల్సిన అవసరం లేదని కిషన్ రెడ్డి అన్నారు. "1975లో కాంగ్రెస్ వేలాది మందిని జైళ్లలో పెట్టింది, మీడియాపై నిషేధం విధించింది, పౌరుల హక్కులను కాలరాసింది" అని ఆయన గుర్తుచేశారు. తెలంగాణలో తాము శాంతియుతంగా కార్యక్రమాలు చేయాలన్నా హైకోర్టు అనుమతి తీసుకోవాల్సి వస్తోందని, ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాలపై ఎలాంటి ఆంక్షలు విధిస్తోందో రాహుల్ వచ్చి చూడాలని ఆయన అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజును పురస్కరించుకుని బీజేపీ దేశవ్యాప్తంగా నెల రోజుల పాటు 'సేవా సంకల్ప్ అభియాన్' నిర్వహిస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ప్రజలకు సేవ చేయడం, వైద్య శిబిరాలు నిర్వహించడం, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించడం వంటివి చేపడుతున్నామని ఆయన వివరించారు.

# బ్రేకప్ చెప్పిన ప్రియురాలు..

## ఆమెను లోయలోకి తోసేసిన ప్రియుడు

ముంబై: ప్రియురాలు బ్రేకప్ చెప్పడంపై ప్రియుడు ఆగ్రహించాడు. ఆమెను లోయలోకి తోసేశాడు. ఆ తర్వాత పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. ఆ మహిళ కనిపించడం లేదని తొలుత అతడు చెప్పాడు. అయితే దర్యాప్తులో అసలు విషయాన్ని పోలీసులు తెలుసుకున్నారు. (ఝఅ జాబంష్ట్రవం స్త్రఅతీశ్రీటతీఅవఅ అత్శీ స్త్రశీతీస్త్రవ) మహారాష్ట్రలోని కొల్హాపూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. గార్గోటిలోని అవధూత్ కాలనీకి చెందిన 25 ఏళ్ల శ్రీపాద్ దింకర్, ఎదురు ఇంట్లో నివసించే 23 ఏళ్ల తరణ్ణుమ్ బషీర్ నాయక్ ప్రేమించుకున్నారు. మహగావ్‌లోని కాలేజీలో ఆమె ఇంజినీరింగ్ చదువుతున్నది. ఇటీవల తరణ్ణుమ్‌కు ఒక వ్యక్తితో పెళ్లి సంబంధం నిశ్చయమైంది. దీంతో శ్రీపాద్‌తో సంబంధాన్ని కొనసాగేందుకు ఆమె నిరాకరించింది. ఈ నేపథ్యంలో వారిద్దరి మధ్య విభేదాలు తలెత్తాయి.కాగా, అక్టోబర్ 9న తరణ్ణుమ్‌కు శ్రీపాద్ ఫోన్ చేశాడు. నాయక్‌వాడిలోని లోతైన లోయ సమీప ప్రాంతానికి ఆమెను తీసుకెళ్లాడు. తనకు వివాహం నిశ్చయమైందని, ఇకపై తమ సంబంధాన్ని కొనసాగించలేమని ఆమె అతడికి చెప్పింది. తరణ్ణుమ్ నిర్ణయం పట్ల శ్రీపాద్ ఆగ్రహించాడు. ఆమెను లోయలోకి తోసేయడంతో మరణించింది.ఆ తర్వాత భుదర్‌గఢ్ పోలీస్ స్టేషన్‌కు శ్రీపాద్ వెళ్లాడు. తరణ్ణుమ్ అదృశ్యమైనట్లు తొలుత చెప్పాడు. పోలీసులు అతడ్ని ప్రశ్నించగా చివరకు ఆమెను లోయలోకి తోసేసినట్లు ఒప్పుకుని లొంగిపోయాడు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. యువతి మృతదేహాన్ని గుర్తించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శ్రీపాద్‌ను అరెస్ట్ చేశారు. అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు.

# తెలంగాణలో సాగు, తాగునీటి కష్టాలు

నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవడం ద్వారా భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బందులను కొంతవరకు తగ్గించవచ్చని పేర్కొన్నారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సైతం నీటి లభ్యతపై ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలు తగ్గితే తాగునీటి సరఫరాతో పాటు సాగునీరు, జలవిద్యుత్ ఉత్పత్తిపైనా ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు. పంటలు వేసే ముందు అందుబాటులో ఉన్న నీటి పరిస్థితిని రైతులు అంచనా వేసుకోవాలని సూచించారు. ముందుగా ప్రజల తాగునీటి అవసరాలను తీర్చడంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితులతో పాటు విద్యుత్ సరఫరా విషయంలోనూ సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని మంత్రి పొంగులేటి తెలిపారు. అవసరమైన విద్యుత్‌ను బయట మార్కెట్ నుంచి కొనుగోలు చేయడం ఖరీదైన వ్యవహారంగా మారుతోందని యూనిట్‌కు రూ.15 చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నా అందుబాటులో విద్యుత్ లభించని పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజలు విద్యుత్‌ను అవసరమైన మేరకే వినియోగిస్తూ పొదుపు పాటించాలని కోరారు.ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్ రంగాలకు సంబంధించి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. రాబోయే 8 నెలలు కీలకమని, గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇప్పటికే సాగులో ఉన్న పంటలు చేతికొచ్చే వరకు నీటి కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని, చుక్క నీరు కూడా వృథా కాకుండా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు.పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ప్రత్యేక వార్‌రూమ్, టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసే అంశంపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. వర్షాభావ పరిస్థితులు ఉన్న మండలాలకు సహాయం అందించాలని, కరువు నివారణ చర్యల కోసం కేంద్రం నుంచి రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కోరినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రస్తుతం ఉన్న 125 పనిదినాలకు అదనంగా మరో 50 రోజులు కల్పించాలని కేంద్రాన్ని కోరే అంశాన్ని కూడా పరిశీలిస్తోంది. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, రైతుల సమస్యలు, తాగు-సాగునీటి అవసరాలు, విద్యుత్ సరఫరాపై చర్చించేందుకు త్వరలోనే ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో తీసుకునే నిర్ణయాలు రాబోయే నెలల్లో ప్రభుత్వ కార్యాచరణకు దిశానిర్దేశం చేయనున్నాయి.

## దసరా సెలవుల్లో ఇళ్ల భద్రతపై

# అప్రమత్తంగా ఉండాలి

- ఇళ్లకు తాళాలు వేసి ఊళ్లకు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలి
- అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే డయల్ 112కు సమాచారం ఇవ్వాలి
- కీసర పోలీస్ ఇన్‌స్పెక్టర్ బిక్కి రమేష్ సూచనలు



**కీసర ( ప్రశ్న న్యూస్)** దసరా పండుగ సెలవుల నేపథ్యంలో ప్రజలు స్వగ్రామాలకు, బంధువుల ఇళ్లకు వెళ్లే సమయంలో ఇళ్ల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కీసర పోలీస్ ఇన్‌స్పెక్టర్ బిక్కి రమేష్ సూచించారు. పండుగ సెలవుల్లో ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని, దొంగతనాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఒక ప్రకటనలో కోరారు.

### ఇంటి భద్రతకు ముందస్తు చర్యలు తప్పనిసరి

ప్రయాణానికి వెళ్లే ముందు ఇంటి తలుపులకు బలమైన తాళాలు వేయాలని, కిటికీలు సక్రమంగా మూసివేయాలని ఇన్‌స్పెక్టర్ సూచించారు. ఇంటి ముందు వార్తాపత్రికలు, పాల ప్యాకెట్లు పేరుకుపోకుండా వాటి సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయాలని తెలిపారు. ఇలా పేరుకుపోవడం వల్ల ఇల్లు ఖాళీగా ఉందనే విషయం దొంగలకు తెలిసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

### సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయో లేదో తనిఖీ చేసుకోవాలి

ఇళ్ల వద్ద ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో ముందుగానే తనిఖీ చేసుకోవాలని సూచించారు. తాము ఊరికి వెళ్తున్న విషయాన్ని నమ్మకమైన పొరుగువారికి తెలియజేయాలని, అవసరమైతే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రయాణానికి సంబంధించిన వివరాలను సామాజిక మాధ్యమాల్లో బహిరంగంగా వెల్లడించవద్దని హెచ్చరించారు.

### అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలి

కాలనీలు, గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు కనిపిస్తే వెంటనే డయల్ 112కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని బిక్కి రమేష్ కోరారు. పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద కదలికలను గమనిస్తూ పోలీసులకు సహకరించాలని సూచించారు. ప్రజలు దసరా పండుగను ఆనందంగా, ప్రశాంతంగా జరుపుకోవాలని, తమ ఇళ్ల భద్రత విషయంలో నిర్లక్ష్యం చేయకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ఇన్‌స్పెక్టర్ బిక్కి రమేష్ విజ్ఞప్తి చేశారు.

## ఎఫ్‌ఎఫ్‌ఎస్ యాప్‌లో భూవిస్తీర్ణం లెక్కల్లో

# లోపాలు సవరించాలి

**- మట్టపల్లి శ్రీనివాసరావు వినతిపై స్పందించిన కేంద్ర ఎరువుల శాఖ**



వరంగల్(ప్రశ్న న్యూస్)ఎరువుల బుకింగ్ కోసం వినియోగిస్తున్న 'ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్' (ఎఫ్‌ఎఫ్‌ఎస్) యాప్‌లో భూవిస్తీర్ణం గణనలో లోపాలను తక్షణమే సవరించాలని వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన రైతు మట్టపల్లి శ్రీనివాసరావు కోరారు. తెలంగాణలో భూమి కొలతలకు ఉపయోగించే గుంటలను సెంట్లుగా తప్పుగా పరిగణించడం వల్ల సాగు విస్తీర్ణం తక్కువగా నమోదవుతోందని ఆయన వినతిపత్రంలో పేర్కొన్నారు.ఒక ఎకరం 40 గుంటలు లేదా 100 సెంట్లకు సమానం. అంటే ఒక గుంట 2.5 సెంట్లు. ఉదాహరణకు ఒక ఎకరం 20 గుంటలు ఉన్న భూమిని 150 సెంట్లుగా లెక్కించాలి. దానిని 120 సెంట్లుగా పరిగణిస్తే 30 సెంట్లు తక్కువగా నమోదవుతుంది. ఈ లోపం వల్ల రైతులకు అనుమతించే ఎరువుల పరిమాణం తగ్గే అవకాశం ఉందని, చిన్న, సన్నకారు రైతుల ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని ఆయన వివరించారు.భూ రికార్డులు, యాప్ వివరాలతో కూడిన వినతిపత్రాన్ని అక్టోబర్ 4న కేంద్ర వ్యవసాయ, ఎరువుల శాఖలకు, తెలంగాణ వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సమర్పించారు. దీనిపై స్పందించిన కేంద్ర ఎరువుల శాఖ అక్టోబర్ 6న అవసరమైన చర్యల కోసం డీబీటీ విభాగానికి సూచనలు ఇచ్చింది. వినతిని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖలోని ఎఫ్‌ఎఫ్‌ఎస్ బృందానికి పంపించి, ఆ విషయాన్ని దరఖాస్తుదారునికి తెలియజేయాలని పేర్కొంది.ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ, రెవెన్యూ శాఖలు కేంద్ర సాంకేతిక బృందంతో సమన్వయం చేసుకుని గుంటల నుంచి సెంట్లకు మార్పిడి, భూవిస్తీర్ణాల కూడికలో లోపాలను వెంటనే పరిశీలించి సవరించాలని శ్రీనివాసరావు కోరారు. ప్రభావిత రైతుల ఎరువుల అర్హతను తిరిగి లెక్కించాలని, సవరణ పూర్తయ్యే వరకు భూ రికార్డులను ధృవీకరించి తగిన ఎరువులు అందించే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# కొత్త జిల్లాల ఏర్పాటు చారిత్రాత్మక ఘట్టం..

## కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



నాగర్ కర్నూల్ : పాలన సౌలభ్యం కోసం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాల్లో కొత్త జిల్లాల ఏర్పాటు చారిత్రాత్మక ఘట్టమని బీఆర్ఎస్ జిల్లా నాయకులు అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా ఏర్పడి పది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు ఆదివారం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.గతంలో జిల్లా కేంద్రాలకు వెళ్లాలంటే ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనేవారని, దూర ప్రయాణాలు చేయాల్సి వచ్చేదని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఈ సమస్యలకు పరిష్కారంగా ప్రజలకు పరిపాలనను మరింత చేరువ చేయాలనే సంకల్పంతో నూతన జిల్లాల ఏర్పాటుకు కేసీఆర్ శ్రీకారం చుట్టారని అన్నారు.నాగర్ కర్నూల్ ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేరుస్తూ ప్రత్యేక జిల్లాను ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంత అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం బలమైన పునాది వేసిందని అన్నారు. జిల్లా ఏర్పాటులో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి కృషి ఎంతగానో ఉందని వెల్లడించారు.

# అథ్లెటిక్స్‌లో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. వివిధ పరుగు, క్షేత్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి మొత్తం 9 పతకాలు సాధించారు. వీటిలో మూడు స్వర్ణాలు, మూడు రజతాలు, మూడు కాంస్య పతకాలు ఉన్నాయి.అండర్-10 బాలికల విభాగంలో సీహెచ్ లాస్యశ్రీ 60, 200 మీటర్ల పరుగు పందాల్లో స్వర్ణ పతకాలు సాధించింది. లంక పార్వతి ఈ రెండు విభాగాల్లో రజత పతకాలు గెలుచుకుంది. అండర్-10 బాలికల లాంగ్‌జంప్‌లో సాన్విక గౌడ్ కాంస్యం, అండర్-12 బాలికల లాంగ్‌జంప్‌లో ఎం.అశ్విని రజత పతకం సాధించారు. అండర్-14 బాలికల 60 మీటర్ల పరుగులో సింధం వజ్ర వరుణవి కాంస్య పతకం గెలుచుకుంది.బాలుర విభాగంలో అండర్-12 300 మీటర్ల పరుగులో సీహెచ్ రితేష్ రజతం, సీహెచ్ జీవన్ కాంస్య పతకాలు సాధించారు. విద్యార్థుల విజయాలపై పాఠశాల సిబ్బంది ,యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, శారీరక దారుఢ్యాన్ని పెంపొందిం చేందుకు ప్రోత్సహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్, సిబ్బంది తెలిపారు.

# న్యూఢిల్లీలో ఉద్రిక్తత.. ఆందోళనకారులతోపాటు జర్నలిస్టుల్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు



దేశ రాజధాని న్యూఢిల్లీలో ఆందోళనకర వాతావరణం కొనసాగుతోంది. సీజేపీ, ఎస్ఎఫ్ఐ సహా పలు సంఘాల నేతలు ఈసీకి వ్యతిరేకంగా ఆందోళనకు సిద్ధమవ్వగా.. వారిని ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆందోళనకారులతోపాటు పలువురు జర్నలిస్టుల్ని కూడా పోలీసులు అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. వీరిలో అనేక మంది మహిళలు కూడా ఉన్నారు.ప్రముఖ జాతీయ దినపత్రికలకు చెందిన జర్నలిస్టులు, డిజిటల్ జర్నలిస్టులు, కెమెరా పర్సన్స్ సహా మీడియాలో పని చేసే అనేక మందిని రైజైనా రోడ్‌లోని ప్రెస్ క్లబ్ బయట పోలీసులు అరెస్టు చేశారు. ప్రెస్ క్లబ్ బయట దాదాపు 70 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఆందోళనకారుల్ని కన్నాట్ ప్లేస్ నుంచి బస్సులో తరలిస్తుండగా.. వారిలో ఇద్దరు జర్నలిస్టులు, ఇద్దరు ఆందోళనకారులకు గాయాలయ్యాయి. కొందరికి రక్తస్రావం కూడా జరిగింది.రెండు బస్సుల్లో వంద మంది ఆందోళనకారుల్ని అరెస్టు చేసి, తరలించారు.

సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాల్సిందే అంటూ ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు. వీరిని పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించగా.. ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తింది. ఈ ఘటనలో పలువురు నిరసనకారులపై దాడి జరిగినట్లు తెలుస్తోంది. ఆందోళనకారుల్ని అత్యవసరమైతే తప్ప అరెస్టు చేయకూడదని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఈ అరెస్టుల పర్వం కొనసాగుతోంది. మరోవైపు సీఈసీ రాజీనామా చేసేవరకు తమ పోరాటం కొనసాగుతుందని సీజేపీ ప్రకటించింది.ఇదే సమయంలో అన్ని పార్టీలు ఈ విషయంలో ఐక్యంగా ఉండాలని కోరింది. తాము ఆందోళన చేయబోమంటూ బాండ్‌పై సంతకం పెట్టినట్లు జరుగుతున్న ప్రచారాన్ని సీజేపీ నేతలు ఖండించారు. తాము ఎలాంటి బాండ్‌పై సంతకం చేయలేదని స్పష్టం చేశారు. అరవింద్ కేజ్రీవాల్, మమతా బెనర్జీ వంటి ప్రముఖుల్ని ఢిల్లీ పోలీసులు శనివారమే అదుపులోకి తీసుకున్నారు. వారిని గృహ నిర్బంధంలో ఉంచారు. ఇప్పటివరకు 7,000 మందికిపైగా అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

## దీప్కేకు అతడి నానమ్మ మరణవార్తను

# వెంటనే తెలియజేశాం

### - ఢిల్లీ పోలీసులు



కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే కు అతడి నానమ్మ మరణవార్తను చెప్పలేదన్న ఆరోపణలను ఢిల్లీ పోలీసులు తోసిపుచ్చారు. ఆ విషాద వార్తను అత్యంత సున్నితంగా ఆయనకు వెంటనే తెలియజేశామని, అంత్యక్రియల కు సొంతూరు వెళ్లేందుకు ప్రయాణ ఏర్పాట్లలో సాయం చేస్తామని కూడా చెప్పామని తెలిపారు. ఈ మేరకు ఆదివారం పోలీసులు ఓ వీడియోను విడుదల చేశారు.తన కుమారుడికి నానమ్మ మరణవార్తను చెప్పలేదని దీప్కే తల్లి ఈ ఉదయం ఆరోపించారు. సీజేపీ కూడా ఇదే తరహా ఆరోపణలు చేయడంతో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ నేహా యాదవ్ విలేకరుల సమావేశంలో ఈ వీడియోను మీడియాకు ప్రదర్శించారు. సమాచారం అందిన వెంటనే దీప్కేకు నానమ్మ మరణవార్త గురించి, అంత్యక్రియలు జరిగే సమయం గురించి తెలియజేశామని నేహా యాదవ్ చెప్పారు. మానవతా దృక్పథంతో సొంతూరు వెళ్లేందుకు అవసరమైన సాయమూ అందిస్తామని చెప్పినట్లు తెలిపారు. కానీ తమ సాయాన్ని తీసుకునేందుకు అభిజీత్ నిరాకరించారని డీసీపీ నేహా తెలిపారు. కుటుంబసభ్యులతో మాట్లాడేందుకు కూడా అవకాశం కల్పించామన్నారు.

## మున్సిపల్ కమిషనర్ తీరుపై

# కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం

### - బీఆర్ఎస్ కౌన్సిలర్స్




తొర్రూరు : మున్సిపాలిటీ నిధులతో బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తూ ప్రైవేటు సంస్థలకు ప్రచారం కల్పించడం సరికాదని తొర్రూరు మున్సిపాలిటీకి చెందిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఆరోపించారు. ప్రజాధనంతో నిర్వహించే అధికారిక కార్యక్రమాల్లో రాజకీయ నాయకులకు ప్రాధాన్యతనిస్తూ, ప్రజాప్రతినిధులైన కౌన్సిలర్లను విస్మరించడాన్ని ప్రశ్నించారు. ఆదివారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కౌన్సిలర్లు సమావేశమై పట్టణంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ నిర్వహణ కోసం మున్సిపాలిటీ నిధుల నుంచి లక్షల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ, ఈ వేడుకలను ఉమెన్ ఎంపవర్మెంట్ ఆఫ్ తెలుగు అసోసియేషన్ (వేటా) నిర్వహించినట్లుగా ప్రచారం చేయడం సరికాదన్నారు. ప్రభుత్వ నిధులతో నిర్వహించిన కార్యక్రమానికి ప్రైవేటు సంస్థకు ప్రచారం కల్పించడం వెనుక ఉద్దేశమేమిటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ నాయకురాలు ఝాన్సీ రెడ్డిని ప్రభుత్వ కార్యక్రమంలో ఏ హోదాలో వేదికపైకి ఆహ్వానించారని వారు ప్రశ్నించారు. ప్రజలచే ఎన్నికైన కౌన్సిలర్లను వేదికపైకి పిలవకుండా, కాంగ్రెస్ నాయకులకు ప్రాధాన్యత ఇవ్వడం దారుణమన్నారు. బతుకమ్మ వేడుకలు అధికారిక ప్రభుత్వ కార్యక్రమమా? లేక కాంగ్రెస్ పార్టీ కార్యక్రమమా? అన్నది అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. తొర్రూరు మున్సిపల్ కమిషనర్ అధికార పార్టీ నాయకుల సూచనలకు అనుగుణంగా వ్యవహరిస్తున్నారని, ఆయన తీరు కాంగ్రెస్ పార్టీ ఏజెంట్‌లా ఉందని ఆరోపించారు.మున్సిపాలిటీ పరిపాలనలో రాజకీయ జోక్యం పెరుగుతోందని ఆరోపిస్తూ, కమిషనర్ వ్యవహారశైలిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు కర్నే నాగరాజు, భూసాని జయమ్మ ఉప్పలయ్య, చకిలేల అలివేలు మణిరాజు, తూర్పాటి రవి, పేర్ల జంపన్న, మాడుగుల భవాని లత, ధరావత్ పద్మ కిషన్, శ్యామల శ్యామ్, కిన్నెర కవిత సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## మాదారం డిస్పెన్సరీ తరలింపు కుట్రను అడ్డుకుంటాం

### - మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



తాండూర్ : మాదారం డిస్పెన్సరీ తరలింపు కుట్రను అడ్డుకుంటామని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. తాండూర్ మండలం మాదారం టౌన్ షిప్ లో ఆదివారం ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసి పర్యటించారు. మాదారం టౌన్ షిప్‌లోని సింగరేణి ఆసుపత్రి (డిస్పెన్సరీ) తరలించే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. కార్మికులకు కనీసం వైద్యం అందించే పరిస్థితి లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. డిస్పెన్సరీ తరలించకుండా స్థానిక ప్రజలకు అందుబాటులోనే కొనసాగించాలని, ప్రజలకు వైద్య సేవలు నిరంతరం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఒకవేళ దానిని తరలిస్తే బీఆర్ఎస్ అధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అంతకుముందు ఆయన మాదారం కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యకమంలో మాజీ ఎంపీపీ పూసాల ప్రణయ్ కుమార్, మాజీ జడ్పీటీసీ మంగపతి సురేష్ బాబు, అచ్చలాపూర్ ఉప సర్పంచ్ గట్టు సంతోష్ కుమార్, బీఆర్ఎస్ నాయకులు ఎలుక రాంచందర్, మొగిలి శంకర్, బోడ సతీష్ గోమాస తిరుపతి, క్రాంతి, సుభాష్, రాజేందర్, శశి, రమాదేవి, చంద్రకళ, రాజమణి, గుండేటి లక్ష్మి, సామ్య, కోల జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## కడప డీఎస్పీగా భవానీ భాధ్యతల స్వీకరణ



కడప నూతన డీఎస్పీగా టీ. భవాని బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ డీఎస్పీగా పనిచేస్తున్న ఆమెను ఉన్నతాధికారులు కడపకు బదిలీ చేశారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం కడపలోని డీఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. టీ. భవాని స్వస్థలం అనంతపురం జిల్లా కదిరి పట్టణం. హిందూపురంలో ప్రాథమిక విద్య, తిరుపతి విద్యానికేతన్‌లో ఆమె బీటెక్ పూర్తి చేశారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిగా పనిచేసిన ఆమె తర్వాత కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ అయ్యారు. తొలుత గుంటూరు వ్యవసాయ కమిషనరేట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించారు. ఇక 2018 గ్రూప్ 2కి ఎంపికైన ఆమె చాపాడులో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేశారు. 2023 ఆగస్టులో గ్రూప్ 1లో డీఎస్పీ సివిల్‌గా ఎంపికయ్యారు. శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం తొలిసారిగా డీఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. 2026 ఏప్రిల్‌లో కాశీబుగ్గ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఆమె.. తాజాగా కడపకు బదిలీ అయ్యారు.

# ఈ ప్రభుత్వానికి ఎంప్లాయింట్ పాలసీనే లేదు

### - ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్



ఎన్నికలకు ముందు 2 లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ అంటూ ఆశలు చూపి గద్దెనెక్కిన కాంగ్రెస్.. మూడేళ్లయినా ఉద్యోగాలు ఇవ్వకుండా యువతను నట్టేట ముంచిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలకే అపాయింట్‌మెంట్ లెటర్లు అందించి కాంగ్రెస్ ప్రభుత్వం గప్పాలు కొడుతుందన్నారు. నిరుపేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఆసరాగా నిలిచే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కూడా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు.ఈ విషయమై ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వంలో 2023 తర్వాత న్యూ ఎంప్లాయింట్ పాలసీ అని గూగుల్‌లో కొట్టి చూడండి.. ఈ ప్రభుత్వానికి ఎంప్లాయింట్ పాలసీనే లేదని దాసోజు శ్రవణ్ కుమార్ అన్నారు. ఇదే కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు టీఎస్ఐపాస్ ద్వారా దాదాపు 20-22 లక్షల ప్రైవేట్ ఉద్యోగాలు కల్పించిన రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం. ప్రభుత్వంలో దాదాపు లక్షా 75వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిన రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం. వీళ్లు వచ్చినప్పుడు ఒకటేసంవత్సరంలో 2 లక్షల ఉద్యోగాలిస్తమని చెప్పారు. జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామన్నారు.. ఇవాళ్టికి జాబ్ క్యాలెండర్ లేదు.. 2 లక్షల ఉద్యోగాలు లేవన్నారు.గత ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలనే ఇవాళ్టికి కూడా మేం నింపుతున్నమని.. వాళ్ల ఖాతాలో వేసుకుని నేడు మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఫీయింబర్స్‌మెంట్ పేద పిల్లలు, మధ్యతరగతి పిల్లలు చదువుకునేందుకు ఒక ఆయుధం.. దాన్ని కాంగ్రెస్ సర్కార్ పూర్తిగా నిర్వీర్యం చ్ట?స్తున్నది చూస్తున్నం. హైదరాబాద్‌లో అయితే ముఖ్యంగా.. ఒకప్పుడు న్యూయార్క్, డల్లాస్ అని కేటీఆర్ మున్సిపల్ మంత్రిగా ఉన్నప్పుడు గొప్పగా చెప్పుకునేవాళ్లం. ఇవాళ గుంతల రోడ్లు హైదరాబాద్‌కు చిరునామాగా మారిపోయినయన్నారు. ఎక్కడ చూసిన దోమలు.. దోమల మందు వాడుతలేరు.. బ్లీచింగ్ చేయడం లేదు.. ఫాగింగ్ లేదు.. చిన్న చిన్న రోడ్లను కూడా రిపేర్ చేస్తలేరు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఉన్న కాబట్టి చెప్తున్నా.. అప్పుడెప్పుడో పీజేఆర్ బతికున్నప్పుడు ప్లాస్టిక్ కుండలో, మట్టికుండలో పట్టుకొచ్చి రోడ్లమీద ధర్నాలు చేస్తుండే.. వచ్చే వేసవిలో మళ్లీ రోడ్లపైకి వచ్చి ఆందోళన చేసే సమయం వస్తది.. అందుకు రేవంత్‌రెడ్డినే బాధ్యత వహించాలన్నారు.

## ప్రయాణికుడి పవర్ బ్యాంకువల్ల

# ఇండిగో ఫ్లైట్‌లో మంటలు..

### శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఎమర్జెన్సీ ల్యాండింగ్..!



ఓ ప్రయాణికుడి పవర్ బ్యాంకు కారణంగా ఇండిగో విమానం లో మంటలు లేచాయి. దాంతో ఒక్కసారిగా విమానంలో కలకలం రేగింది. విమానం గాల్లో ఉండగా ఈ ఘటన జరగడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన విమాన సిబ్బంది మంటలను ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన నేపథ్యంలో విమానాన్ని హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయానికి మళ్లించారు.వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో ఇండిగో విమానం 6జు6115 ఢిల్లీ నుంచి చెన్నైకి బయలుదేరింది. విమానం గాల్లో ఉండగా, ఓవర్ హెడ్ లగేజీ కంపార్ట్‌మెంట్‌లో ఉన్న ఓ ప్రయాణికుడి పవర్ బ్యాంక్ నుంచి అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. పొగలు రావడాన్ని గమనించిన క్యాబిన్ సిబ్బంది వెంటనే స్పందించి, విమానంలో అందుబాటులో ఉన్న భద్రతా పరికరాలతో మంటలను అదుపులోకి తెచ్చారు.

ముందుజాగ్రత్త చర్యగా, పైలట్ విమానాన్ని సమీపంలోని హైదరాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం వైపు మళ్లించారు. విమానం శంషాబాద్‌లో సురక్షితంగా ల్యాండ్ అవ్వడంతో ప్రయాణికులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రయాణికులు, సిబ్బంది అంతా క్షేమంగా ఉన్నారని ఇండిగో సంస్థ ప్రకటించింది. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. అగ్నిప్రమాదానికి దారితీసిన కచ్చితమైన కారణాలను, ఆ పవర్ బ్యాంక్ ఏ కంపెనీకి చెందినది అనే వివరాలను సేకరిస్తున్నారు.కాగా విమాన ప్రయాణాల్లో లిథియం-అయాన్ బ్యాటరీలు, పవర్ బ్యాంకులవల్ల అగ్నిప్రమాదాలు జరిగే ప్రమాదం ఉన్నందున, వీటిని కేవలం క్యాబిన్ బ్యాగేజీలోనే ఉంచాలని, విమానంలో ఛార్జింగ్ చేయరాదని విమానయాన నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నిబంధనల ప్రాముఖ్యతను తాజా ఘటన మరోసారి గుర్తుచేసింది.

# జర్నలిస్టు వెంకట్‌కు జర్నలిస్టు సంఘాల అండ

**పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా..**

**త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష**



మైలవరం(ప్రశ్న న్యూస్) జర్నలిస్టుల మధ్య ఐక్యత, పరస్పర ఆత్మీయతకు నిదర్శనంగా ఏపిబీజేఏ మైలవరం నియోజకవర్గ అధ్యక్షుడు, సాక్షి రిపోర్టర్ ఉయ్యూరి వెంకట్‌ను ఏపీడబ్ల్యూజేఎఫ్, ఏపిబీజేఏ నాయకులు ఆదివారం పరామర్శించారు. ఇటీవల చిన్న శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వెంకట్‌ను కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి విధుల్లోకి రావాలని ఆకాంక్షించారు. వృత్తిపరమైన బాధ్యతలతో నిత్యం ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చే జర్నలిస్టు వెంకట్ త్వరగా కోలుకోవాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయనతో కొద్దిసేపు ముచ్చటించి ధైర్యం చెప్పారు. ఈ పరామర్శ కార్యక్రమంలో ఏపిబీజేఏ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగుమాల రాఘవులు, ఏపీడబ్ల్యూజేఎఫ్ మైలవరం నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ సల్మాన్, ప్రధాన కార్యదర్శి సురేష్ వీసం, ఏపిబీజేఏ మైలవరం నియోజకవర్గ కోశాధికారి కాలగడ్డ మనోహర్, ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకుడు బి. వంశీ పాల్గొన్నారు.

# కన్నులపండువగా దుర్గామల్లేశ్వరుల నగరోత్సవం

**మంగళవాయిద్యాలు.. కోలాటాలు..**

**గరగ నృత్యాల నడుమ వైభవంగా ఊరేగింపు**

**అమ్మవారి రావిచెట్టు వద్ద శాస్త్రోక్తంగా ఆస్థాన కార్యక్రమం**



ఇంద్రకీలాద్రి(ప్రశ్న న్యూస్) ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దివ్య నగరోత్సవం కన్నులపండువగా సాగింది. వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ



స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల పల్లకీ ఊరేగింపు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కొండపై ఉన్న శ్రీ మల్లేశ్వర స్వామివారి ఆలయం నుంచి నగరోత్సవం వైభవంగా ప్రారంభమైంది. సంప్రదాయ మంగళవాయిద్యాలు, కేరళ వాయిద్యాల నాదం, శాక్సాఫోన్ స్వరాలు, భక్తుల కోలాటాలు, గరగ నృత్యాలతో ఊరేగింపు ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. దారి పొడవునా భక్తులు స్వామి, అమ్మవార్లకు కర్పూర నీరాజనాలు సమర్పిస్తూ భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, పాలకమండలి సభ్యులు, ఆలయ అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు నగరోత్సవంలో పాల్గొన్నారు. కనకదుర్గానగర్, రథం సెంటర్, వినాయకుడి గుడి, కెనాల్ రోడ్డు, ఘాట్ రోడ్డు మీదుగా సాగిన ఊరేగింపు భక్తుల జయజయధ్వానాల నడుమ తిరిగి ఇంద్రకీలాద్రికి చేరుకుంది.

### రావిచెట్టు వద్ద ఆస్థానం

నగరోత్సవం అనంతరం ఇంద్రకీలాద్రిపై అమ్మవారి పవిత్ర రావిచెట్టు ప్రాంగణంలో స్వామి, అమ్మవార్లకు అర్చకులు సంప్రదాయబద్ధంగా విశేష పూజలు నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తంగా ఆస్థాన కార్యక్రమాన్ని వైభవంగా జరిపించారు. తొలి రోజు ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన నగరోత్సవం భక్తుల్లో ఆధ్యాత్మిక ఆనందాన్ని నింపింది. దుర్గామల్లేశ్వరుల దివ్య దర్శనంతో ఇంద్రకీలాద్రి భక్తి పారవశ్యంలో మునిగిపోయింది.

## కనకదుర్గమ్మకు కాణిపాకం వినాయకుడి పట్టువస్త్రాలు

**ఈవో పెంచల కిషోర్ ఆధ్వర్యంలో సమర్పణ**



ఇంద్రకీలాద్రి(ప్రశ్న న్యూస్) దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారికి ఆదివారం సాయంత్రం కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు. కాణిపాకం దేవస్థానం ఈవో పెంచల కిషోర్ ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్తలు, అర్చకులు అమ్మవారికి పట్టువస్త్రాలను భక్తిశ్రద్ధలతో అందజేశారు.

### ఘన స్వాగతం.. వేదాశీర్వచనం

కాణిపాకం ఆలయ బృందానికి ఇంద్రకీలాద్రి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వీకే శీనా నాయక్ స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి దర్శనానికి ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆలయ పండితులు వేదాశీర్వచనం అందించి, ప్రసాదం, అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. దసరా ఉత్సవాల సందర్భంగా వివిధ దేవస్థానాల నుంచి అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ కార్యక్రమాలు భక్తి వైభవాన్ని చాటుతున్నాయి.

# శైలపుత్రిగా భ్రమరాంబ..

# భృంగివాహనంపై మల్లికార్జునుడు

**శ్రీశైలంలో శరన్నవరాత్రి శోభ.. శివశక్తుల సన్నిధిలో ఆధ్యాత్మిక వైభవం**

**శాస్త్రోక్తంగా శ్రీదేవీ శరన్నవరాత్ర మహోత్సవాలకు శ్రీకారం**

**తొలిసారిగా సహస్ర చండీపారాయణ సహిత శతచండీ మహారుద్రయాగం**

**నవరాత్రుల వేళ ప్రత్యేక పూజలు..**

**వేదపారాయణాలు.. సాంస్కృతిక ప్రదర్శనలతో శ్రీగిరి పులకింత**





శ్రీశైలం(ప్రశ్న న్యూస్) నల్లమల కొండల్లో కొలువైన శ్రీశైల క్షేత్రం శరన్నవరాత్రి శోభతో ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లుతోంది. భక్తుల హృదయాల్లో భక్తిభావాన్ని నింపుతూ, ఆలయ ప్రాంగణంలో వేదమంత్రాల నడుమ శ్రీదేవీ శరన్నవరాత్ర మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదిపరాశక్తి శ్రీభ్రమరాంబాదేవి నవదుర్గ అలంకారాల్లో దర్శనమివ్వనుండగా, పరమశివుడు శ్రీమల్లికార్జున స్వామి వివిధ వాహనసేవలపై భక్తులకు కనువిందు చేయనున్నారు. పది రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలు అక్టోబరు 20న ముగియనున్నాయి. లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ నిర్వహించే ఈ వేడుకల్లో ఈ ఏడాది తొలిసారిగా సహస్ర చండీపారాయణ సహిత శతచండీ మహారుద్రయాగానికి శ్రీకారం చుట్టడం విశేషం.

### శాస్త్రోక్తంగా ఉత్సవాలకు అంకురార్పణ

ఉత్సవాల ప్రారంభాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉదయం ఆలయ సంప్రదాయాల ప్రకారం ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, ప్రధానార్చకులు, స్థానాచార్యులు, అర్చకులు, వేదపండితులు, అధికారులు పసుపు, కుంకుమలు, ఫలపుష్పాలతో ఆలయంలోకి ప్రవేశించారు. అనంతరం అమ్మవారి ఆలయ మండపంలో యాగశాల ప్రవేశం, మహాగణపతి పూజ, దీక్షాసంకల్పం, కంకణపూజ, కంకణధారణ, ఋత్విగ్వరణం తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి యాగశాలలో అఖండదీపస్థాపన, వాస్తుపూజ, మండపారాధన, చండీకలశస్థాపన, శ్రీచక్రార్చన, నవగ్రహ జపాలు, చతుర్వేద పారాయణాలు, చండీసప్తశతి, మహావిద్యా పారాయణాలు నిర్వహించారు. స్వామివారి యాగశాలలో శివసంకల్పం, గణపతిపూజ, వాస్తుపూజ, రుద్రకలశస్థాపన తదితర క్రతువులు జరిపించారు. సాయంత్రం అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠాపన కార్యక్రమాలతో ఉత్సవాలకు మరింత వైదిక శోభ చేకూరనుంది.

### శైలపుత్రి రూపంలో అమ్మవారి దర్శనం

నవదుర్గలలో ప్రథమ స్వరూపమైన శైలపుత్రిగా శ్రీభ్రమరాంబాదేవి ఆదివారం సాయంత్రం భక్తులకు దర్శనమివ్వనున్నారు. ద్విభుజాలతో ఒక చేతిలో త్రిశూలం, మరో చేతిలో పద్మాన్ని ధరించిన ఈ దేవీ స్వరూపం శక్తి, శుభం, విజయానికి ప్రతీకగా భావిస్తారు. నవరాత్రుల్లో రోజుకో విశిష్ట అలంకారంలో అమ్మవారు దర్శనమివ్వడం భక్తులకు ప్రత్యేక అనుభూతిని అందిస్తుంది. అమ్మవారి అలంకరణలు, పుష్పాలంకారాలు, సంప్రదాయ పూజలు క్షేత్రానికి పండుగ కళను తీసుకురానున్నాయి.

### భృంగివాహనంపై స్వామి అమ్మవార్లు

శరన్నవరాత్రి ఉత్సవాల తొలిరోజు శ్రీమల్లికార్జున స్వామి, శ్రీభ్రమరాంబాదేవి భృంగివాహనసేవలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి భృంగివాహనంపై వేంచేపు చేయించి పూజలు నిర్వహిస్తారు. వాహనసేవలో స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం నిర్వహించే ఈ సేవలు నవరాత్రి వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. శివశక్తుల కొలువైన శ్రీశైలంలో పది రోజులపాటు సాగే శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందించనున్నాయి. అమ్మవారి అలంకారాలు, స్వామి అమ్మవార్ల వాహనసేవలు, వైదిక క్రతువులు, భక్తి సాంస్కృతిక కార్యక్రమాలతో శ్రీశైల క్షేత్రం నవరాత్రి వైభవాన్ని చాటనుంది.

# రూ.కోట్ల అవకతవకలు.. ఇద్దరిపైనే చర్యలా.?

**వీటీపీఎస్ స్టోర్స్ వ్యవహారంలో విచారణ నివేదికలు ఏం చెబుతున్నాయి.?**

**రూ.1.05 కోట్ల క్యాష్ లోటు.. టపాసుల విక్రయాల్లోనూ నష్టం**

**డీసీవో, సెక్షన్--51, సీఈ నివేదికల ఆధారంగా బాధ్యులందరిపై చర్యలకు డిమాండ్**

**నివేదికలో ప్రస్తావించిన వ్యక్తి డైరెక్టర్‌గా కొనసాగడంపై అభ్యంతరాలు**




ఇబ్రహీంపట్నం(ప్రశ్న న్యూస్) వీటీపీఎస్ ఆఫీసర్స్ కన్స్యూమర్స్ కో–ఆపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్ (జి.2642)లో ఆర్థిక అవకతవకల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. పెట్రోల్ బంక్ నగదు లెక్కల్లో భారీ లోటు, దీపావళి టపాసుల విక్రయాల్లో నష్టం జరిగినట్లు విచారణ నివేదికల్లో పేర్కొన్నారని సమాచారం. ఈ వ్యవహారంలో పలువురి బాధ్యతను నివేదికలు ప్రస్తావించినట్లు చెబుతున్నప్పటికీ, ఇద్దరిపైనే సస్పెన్షన్ చర్యలు తీసుకున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మిగిలినవారిపై చర్యలేవీ.? నివేదికల్లో పేర్కొన్న అంశాలపై అధికారులు ఏం తేల్చారు.? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### రూ.1.05 కోట్ల నగదు లోటు..

సొసైటీ పరిధిలోని ఆటో కేర్ సెంటర్ (పెట్రోల్ బంక్)లో 2020 ఏప్రిల్ 1 నుంచి 2025 అక్టోబరు 31 వరకు లెక్కలను పరిశీలించగా రూ.1,05,80,886.49 నగదు లోటు ఉన్నట్లు విచారణలో గుర్తించారని అందిన వివరాలు వెల్లడిస్తున్నాయి. సేల్స్ బాయ్స్ వసూలు చేసిన నగదును అధికారిక ఖాతాలో జమ చేయకుండా వ్యక్తిగత ఖాతాల ద్వారా బదిలీ చేసినట్లు నివేదికలో పేర్కొన్నారని సమాచారం. సూపర్‌వైజర్ టీ.వీ.జీ. కృష్ణారావుతో పాటు మాజీ అకౌంటెంట్, మాజీ అధ్యక్షుడు, మాజీ కార్యదర్శి, డైరెక్టర్ల పాత్రపైనా నివేదికలో ప్రస్తావన ఉన్నట్లు తెలుస్తోంది. ఈ అంశాలపై అసలు నివేదికలోని నిర్ధారణలు, సంబంధిత వ్యక్తుల వివరణలను అధికారులు స్పష్టం చేయాల్సి ఉంది.

### టపాసుల విక్రయాల్లోనూ నష్టమంటూ నివేదిక

2024 దీపావళి సందర్భంగా మిగిలిన టపాసుల నిల్వ విలువ రూ.14,23,668.63గా ఉండగా, వాటిని రూ.3,51,463.10కు విక్రయించినట్లు అందిన సమాచారం పేర్కొంటోంది. ఈ లావాదేవీ వల్ల స్టోర్స్‌కు రూ.4,70,410.53 నికర నష్టం వాటిల్లినట్లు విచారణ నివేదికలో ప్రస్తావించారని సమాచారం. కమిటీ అనుమతి లేకుండా విక్రయాలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో, నిర్ణయం తీసుకున్నవారి పాత్రతోపాటు విక్రయ ధరను ఎలా నిర్ణయించారన్న అంశాన్ని కూడా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

### డీసీవో నివేదికలోని వారందరిపై చర్యలేవి.?

స్టోర్స్ అవకతవకలపై డీసీవో నివేదికలో ప్రస్తావించిన వారందరి బాధ్యతను పరిశీలించాలని సభ్యులు కోరుతున్నట్లు సమాచారం. ప్రస్తుత కమిటీలో డైరెక్టర్‌గా కొనసాగుతున్న డి. శ్రీధర్ పాత్రను డీసీవో నివేదికలో పేర్కొన్నట్లు ఫిర్యాదుదారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో విచారణ నిష్పాక్షికంగా సాగేందుకు ఆయన కొనసాగింపుపై సమీక్ష జరపాలని డిమాండ్ చేస్తున్నారు. నివేదికలోని అసలు వివరాలు, సంబంధిత వ్యక్తుల వివరణలు పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

### 23 సమావేశాలకు హాజరు వివరాలపైనా ప్రశ్నలు

డాక్టర్ ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ కమిటీ నివేదిక ఐదో పేజీలోని వివరాల ప్రకారం, మొత్తం 23 సమావేశాలకు డి. శ్రీధర్ 7, జి. శ్రీనివాసరావు 8, కె. సురేశ్ 8, రవీంద్రబాబు 13 సమావేశాలకు మాత్రమే హాజరైనట్లు ఫిర్యాదుదారులు పేర్కొంటున్నారు. సమావేశాలకు హాజరు, విధుల నిర్వహణ, పర్యవేక్షణలో ఎవరి బాధ్యత ఎంతన్నది రికార్డుల ఆధారంగా తేల్చాలని కోరుతున్నారు.

### సెక్షన్-51 నివేదికలో లయబిలిటీలు

సెక్షన్–51 విచారణ నివేదిక 68, 69, 70 పేజీల్లో సంబంధిత వ్యక్తులపై విధించినట్లు పేర్కొన్న ఆర్థిక బాధ్యతల వివరాలు ఉన్నాయని సమాచారం. అలాగే సీఈ కమిటీ నివేదిక నాలుగో పేజీలో ఇన్‌చార్జి బంక్ డైరెక్టర్ వైఫల్యాలు, ఐదో పేజీలో మేనేజ్‌మెంట్ కమిటీ పనితీరు, ఆరో పేజీలో ట్రెజరర్ వైఫల్యాలను ప్రస్తావించినట్లు ఫిర్యాదుదారులు చెబుతున్నారు. ఈ అంశాలను విడివిడిగా పరిశీలించి, బంక్ నిర్వహణను పర్యవేక్షించిన డైరెక్టర్లు, ట్రెజరర్ సహా బాధ్యుల పాత్రను నిగ్గుతేల్చాలని డిమాండ్ చేస్తున్నారు.

### పక్షపాతానికి తావులేకుండా విచారణ జరగాలి

విచారణ నివేదికల్లో ప్రస్తావించిన అంశాలపై ఇద్దరిపైనే చర్యలు తీసుకుని, మిగిలినవారి విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకున్నారో స్పష్టం చేయాలని సభ్యులు కోరుతున్నారు. డీసీవో, సెక్షన్--51, సీఈ కమిటీ నివేదికలను సమగ్రంగా పరిశీలించి, ఆర్థిక లావాదేవీలు, సమావేశాల హాజరు, నిర్వహణ బాధ్యతల ఆధారంగా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నివేదికల్లో ఆరోపణలు లేదా బాధ్యతల ప్రస్తావన ఉండటం ఒక్కటే తుది నిర్ధారణ కాదు. సంబంధిత వ్యక్తుల వివరణలు, ఆధారాలను పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం ద్వారా మాత్రమే ఈ వ్యవహారంపై నెలకొన్న సందేహాలకు తెరపడనుంది.

# గుంతల రోడ్లు.. మురుగు కుంటలు

**నగరి ఇందిరమ్మ కాలనీకి ఇదేం దుస్థితి.?**

**సీసీ రోడ్లు, కాలువలు, తాగునీరు, వీధిదీపాలు కరువు**

**మౌలిక వసతులు కల్పించాలి.**

**సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్**



నగరి(ప్రశ్న న్యూస్) గుంతలమయమైన రహదారులు.. రోడ్డుపైనే మురుగునీరు.. దోమల బెడద.. చీకట్లో వీధులు! నగరి పట్టణంలోని టి.ఆర్.కండ్రిగ ఇందిరమ్మ కాలనీలో కనీస మౌలిక వసతులు లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్. నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో సీసీ రోడ్లు, మురుగుకాలువలు, తాగునీరు, వీధిదీపాలు తక్షణమే ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్, ప్రత్యేక అధికారిని డిమాండ్ చేశారు. కాలనీ ముఖ్యులతో నిర్వహించిన సమావేశానికి సీపీఐ నగరి పట్టణ కార్యదర్శి వి. వేలన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. సీసీ రోడ్లు లేక వర్షాకాలంలో రహదారులు గుంతలమయమవుతున్నాయని, నడిచేవారు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు.

### రోడ్డుపైనే మురుగునీరు

కాలనీలో మురుగుకాలువలు లేక ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు రోడ్లపైనే నిలిచిపోతోందని నాగరాజు పేర్కొన్నారు. రోజుల తరబడి నీరు నిల్వ ఉండటంతో దుర్వాసన, దోమల బెడద పెరిగి ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తాగునీటి సౌకర్యం లేక స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు.

### వెలగని వీధిదీపాలు

కొన్ని వీధుల్లో దీపాలు లేకపోగా, ఉన్నచోట్ల కూడా సరిగా వెలగడం లేదని విమర్శించారు. దీంతో రాత్రివేళల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు. నగరి మున్సిపల్ కమిషనర్, ప్రత్యేక అధికారి సమన్వయంతో సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో సీపీఐ నాయకులు షబ్బీర్ భాష, సుబ్రహ్మణ్యం, మహేంద్రతో పాటు కాలనీ ప్రతినిధులు లత, దయ, కళ, వేలు, బుజ్జి, రామాచారి, గజ, దాము తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ ప్రాజెక్టులకు మోక్షమెప్పుడో

**కాట్రగడ్డ రిజర్వాయర్‌పై అచ్చెన్నాయుడు కీలక ప్రకటన**

**రూ.7.89 కోట్లతో గ్రామాల్లో అభివృద్ధి పనులు..**

**రహదారుల నిర్మాణానికి భరోసా**



టెక్కలి(ప్రశ్న న్యూస్) ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న సాగునీటి ప్రాజెక్టులకు ఎట్టకేలకు కదలిక వస్తుందా? రైతుల ఆశలు నెరవేరుతాయా? కాట్రగడ్డ రిజర్వాయర్ పూర్తయితే సాగునీటి కష్టాలు తీరుతాయన్న ఆశతో ఎదురుచూస్తున్న ప్రజలకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కీలక ప్రకటన చేశారు. రిజర్వాయర్‌ను పూర్తి చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. మరోవైపు గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధిపై దృష్టి సారిస్తూ టెక్కలి మండలం లింగాలవలస పంచాయతీ పరిధిలో రూ.7.89 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పనులకు శ్రీకారం చుట్టారు.

### మాటల నుంచి చేతల్లోకి పనులు!

టెక్కలి నియోజకవర్గంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయడమే లక్ష్యంగా మంత్రి ఆదివారం పలు గ్రామాల్లో పర్యటించారు. రహదారులు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఆరోగ్య కేంద్రాలు, బస్సు షెల్టర్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. పూర్తయిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు.

టెక్కలి--తెంబూరు రహదారిలో ఆరు కిలోమీటర్ల మేర రూ.2.60 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులు కీలకం కానున్నాయి. సీతారాపురంలో రూ.4 లక్షలతో బస్సు షెల్టర్, తీర్లంగిలో రూ.14.30 లక్షలతో హెల్త్ క్లినిక్ నిర్మించనున్నారు. సొర్లిగాం నుంచి సవర సొర్లిగాం వరకు రూ.70 లక్షలతో రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టారు.

### రెండు ప్రధాన రహదారులపై హామీ

అమర్నాథ్ లాడ్జి నుంచి పోలవరం వరకు, టెక్కలి నుంచి పాతపట్నం వరకు మెరుగైన రహదారులు నిర్మించే బాధ్యత తానే తీసుకుంటానని అచ్చెన్నాయుడు ప్రకటించారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. లింగాలవలస పంచాయతీ పరిధిలో పది గ్రామాలను సందర్శించానని, మిగిలిన గ్రామాల్లోనూ పర్యటించి సమస్యలను తెలుసుకుంటానని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఆర్డీవో ఎం. కృష్ణమూర్తి, కోటబొమ్మాళి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బగాది శేషగిరిరావు, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, ఎంపీడీవో రేణుక, ఎన్ఆర్‌జీఎస్ ఏపీవో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నివేదన వేళ దర్శనాలు ఉండవు

**రాష్ట్రపతి పర్యటనపై దేవస్థానం అధికారిక వివరణ**

**వైదిక కమిటీ ఆగ్రహించిందన్న వార్తల్లో వాస్తవం లేదు**




ఇంద్రకీలాద్రి(ప్రశ్న న్యూస్) భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ నెల 14న ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దర్శనానికి రానున్న నేపథ్యంలో పర్యటన సమయం, అమ్మవారి మహానివేదనపై ప్రసారమవుతున్న వార్తలకు దేవస్థానం అధికారులు వివరణ ఇచ్చారు. రాష్ట్రపతి పర్యటనకు సంబంధించి తుది నిమిషాల వారీ షెడ్యూల్ ఇంకా ఉన్నతస్థాయిలో ఖరారు కావాల్సి ఉందని స్పష్టం చేశారు.రాష్ట్రపతి భవన్ సెక్రటేరియట్, రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ, పోలీసు, జిల్లా యంత్రాంగంతో పర్యటన ఏర్పాట్లపై ప్రాథమిక సమన్వయం జరుగుతోందని తెలిపారు. పర్యటనకు సంబంధించిన అధికారిక షెడ్యూల్ ఖరారైన తర్వాతే పూర్తి వివరాలు వెల్లడవుతాయని పేర్కొన్నారు.

### సాయంత్రం 7 గంటలకు క్రతువులు పూర్తి

దేవస్థానంలో ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు అమ్మవారికి మహానివేదన, పంచహారతులు నిర్వహించడం ఆనవాయితీ అని అధికారులు వివరించారు. సాయంత్రం 6 నుంచి 6.30 గంటల మధ్య మహానివేదన పూర్తయ్యాక, పంచహారతుల సమయంలో కొన్ని దర్శన క్యూలైన్లను కొనసాగిస్తామని తెలిపారు. మహానివేదన, పంచహారతుల క్రతువులు సాయంత్రం 7 గంటలకు పూర్తవుతాయని వెల్లడించారు.

రాష్ట్రపతి దర్శనం సాయంత్రం 7.15 నుంచి 7.30 గంటల మధ్య జరిగినా అది మహానివేదన అనంతరమే ఉంటుందని స్పష్టం చేశారు. నివేదన సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ దర్శనాలు నిర్వహించబోమని, ఆలయ ఆగమ విధానాలకు అనుగుణంగానే అన్ని కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు.

### శాస్త్రోక్తంగానే ఏర్పాట్లు

రాష్ట్రపతి పర్యటనను సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు ప్రధానార్చకులు, స్థానాచార్యులు, వైదిక కమిటీ సభ్యులతో దేవస్థానం అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారని తెలిపారు. వైదిక కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసిందంటూ వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు. వైదిక పండితుల మార్గదర్శకత్వంలో శాస్త్రోక్త విధివిధానాలకు భంగం కలగకుండా రాష్ట్రపతికి దివ్యదర్శనం, వేదాశీర్వచనం అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల వేళ సామాన్య భక్తుల దర్శనాలకు ఇబ్బందులు కలగకుండా చూడటంతోపాటు ప్రముఖుల భద్రతకు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. దేవస్థానం, జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ సమన్వయంతో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నాయని పేర్కొన్నారు. నిరాధార వార్తలతో భక్తుల్లో అయోమయం సృష్టించవద్దని ప్రసార మాధ్యమాలకు దేవస్థానం విజ్ఞప్తి చేసింది.

# మేడ్చల్-సుచిత్ర ఫ్లైఓవర్లకు పిండప్రదానం

**నాలుగేళ్లుగా అసంపూర్తిగానే నిర్మాణ పనులు..**

**ప్రభుత్వ నిర్లక్ష్యంపై వినూత్న నిరసన**

**ఫ్లైఓవర్ల పనులు వెంటనే ప్రారంభించాలి.. మెట్రో రెండో దశకు ఆమోదం తెలపాలి**

**మేడ్చల్ మెట్రో సాధన సమితి డిమాండ్**







మేడ్చల్ (ప్రశ్న న్యూస్) నాలుగేళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయిన సుచిత్ర-మేడ్చల్ ఫ్లైఓవర్ల నిర్మాణ పనులపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మేడ్చల్ మెట్రో సాధన సమితి ఆధ్వర్యంలో ఆదివారం సుచిత్ర సర్కిల్‌లో వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. నిలిచిపోయిన ఫ్లైఓవర్లకు ప్రతీకాత్మకంగా పిండప్రదానం చేసి, ప్రభుత్వ తీరుపై సమితి ప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ఇబ్బందులను పట్టించుకోకుండా పాలకులు, అధికారులు కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు.

### నాలుగేళ్లయినా ముందుకు సాగని పనులు

సుచిత్ర-మేడ్చల్ మార్గంలో ఫ్లైఓవర్ల నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో ఈ మార్గంలో ప్రయాణించే వేలాది మంది ప్రజలు ప్రతిరోజూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమితి నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ రద్దీ, దుమ్ము, కాలుష్యం, రోడ్డు ప్రమాదాల ముప్పుతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. అత్యవసర పనులపై వెళ్లేవారు సైతం ట్రాఫిక్‌లో చిక్కుకుని విలువైన సమయాన్ని కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

### వినతులు ఇచ్చినా స్పందన కరువు

ఫ్లైఓవర్ల నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించాలని కోరుతూ గత రెండేళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధులను పలుమార్లు కలిసి వినతిపత్రాలు సమర్పించినప్పటికీ స్పష్టమైన హామీ లభించలేదని సమితి ప్రతినిధులు తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత కలిగిన పాలకులు ఈ అంశాన్ని నిర్లక్ష్యం చేయడం విచారకరమన్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

### ఫ్లైఓవర్ల పనులు పూర్తి చేయాలి

నిలిచిపోయిన సుచిత్ర-మేడ్చల్ ఫ్లైఓవర్ల నిర్మాణ పనులను తక్షణమే పునఃప్రారంభించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని మేడ్చల్ మెట్రో సాధన సమితి డిమాండ్ చేసింది. నిర్మాణ పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయి? ఎప్పటిలోగా పూర్తవుతాయి? అనే అంశాలపై ప్రభుత్వం ప్రజలకు స్పష్టమైన ప్రకటన చేయాలని కోరింది. ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పనులు వేగవంతం చేసి ప్రజలకు ట్రాఫిక్ కష్టాల నుంచి విముక్తి కల్పించాలని విజ్ఞప్తి చేసింది.

### మెట్రో రెండో దశకు ఆమోదం ఏదీ?

ఉత్తర హైదరాబాద్ అభివృద్ధికి, పెరుగుతున్న జనాభా రవాణా అవసరాలను తీర్చేందుకు మెట్రో రైలు విస్తరణ అత్యంత కీలకమని సమితి నాయకులు పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశకు కేంద్ర ప్రభుత్వం త్వరితగతిన ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు. మేడ్చల్, షామీర్‌పేట్ తదితర ప్రాంతాలకు మెరుగైన మెట్రో కనెక్టివిటీ కల్పించి, ప్రయాణికులకు వేగవంతమైన, సౌకర్యవంతమైన రవాణా సదుపాయాలు అందించాలని కోరారు.

### సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం ఆగదు

ప్రజల తరఫున ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసినా స్పందన లేకపోవడంతోనే పిండప్రదానం రూపంలో నిరసన చేపట్టాల్సి వచ్చిందని సమితి ప్రతినిధులు తెలిపారు. ప్రజల సహనాన్ని చేతగానితనంగా భావించవద్దని హెచ్చరించారు. ఫ్లైఓవర్ల నిర్మాణ పనులు పూర్తిచేయడంతో పాటు మెట్రో రెండో దశకు ఆమోదం లభించే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రజా రవాణా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ఇకనైనా చిత్తశుద్ధితో వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

ఈ నిరసన కార్యక్రమంలో మేడ్చల్ మెట్రో సాధన సమితి నాయకులు సంపత్ రెడ్డి, మహేందర్ రెడ్డి జార్జ్, మోహన్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, సిద్ధి రాములు, శ్రీనివాస్ రెడ్డి, సంధ్య, రాజేశ్వర్, లక్ష్మారెడ్డి, నరేష్ నేత తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణా తీరాన సంస్కృతి సంరంభం

**పున్నమి ఘాట్‌పై విజయవాడ ఉత్సవ్-2.0 సందడి**

**కళారూపాలు.. నృత్య ప్రదర్శనలు..**

**సరస్ మేళాతో నగరానికి కొత్త శోభ**

**విజయవాడ వైభవాన్ని దేశమంతా చాటడమే లక్ష్యం: కేశినేని చిన్ని**

విజయవాడ(ప్రశ్న న్యూస్) కృష్ణమ్మ సాక్షిగా.. కళా వైభవం వెల్లివిరియగా.. సంప్రదాయాల పరిమళం గుబాళించగా.. పున్నమి ఘాట్ వేదికగా విజయవాడ ఉత్సవ్--2.0 అట్టహాసంగా ప్రారంభమైంది. కృష్ణా నది తీరాన సాంస్కృతిక ప్రదర్శనలు, సంప్రదాయ కళారూపాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. విజయవాడ ఆతిథ్యం, సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక వైభవాన్ని దేశవ్యాప్తంగా చాటిచెప్పే లక్ష్యంతో సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ ఆధ్వర్యంలో, రాష్ట్ర ప్రభుత్వం, పర్యాటకశాఖ సహకారంతో ఈ వేడుకలను నిర్వహిస్తున్నారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) చొరవతో నిర్వహిస్తున్న ఉత్సవాలను కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

### కనువిందు చేసిన కళారూపాలు

పున్నమి ఘాట్‌లో ఏర్పాటు చేసిన వేదికపై కళాకారులు ప్రదర్శించిన విభిన్న నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. కనుమరుగవుతున్న సంప్రదాయ కళలకు ప్రోత్సాహం అందించేలా కార్యక్రమాలను రూపొందించారు. స్థానిక కళాకారులు, యువతలోని ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి ఉత్సవాలు దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. దసరా వేడుకల సందడికి తోడుగా విజయవాడ ఉత్సవ్ నగరానికి మరో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

### నగర వైభవాన్ని చాటడమే లక్ష్యం

విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ.. గత ఏడాది తొలి సీజన్‌ను మంత్రి నారా లోకేశ్ ప్రారంభించగా, రెండో సీజన్‌ను కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. నగర ఆతిథ్యం, సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విశిష్టతను దేశవ్యాప్తంగా పరిచయం చేయడమే ఉత్సవ్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. విజయవాడ ఉత్సవ్‌పై ప్రధాని నరేంద్ర మోదీ రాసిన లేఖను అవార్డుగా భావిస్తున్నామని పేర్కొన్నారు. వేడుకల నిర్వహణకు సహకరించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, హోంమంత్రి వంగలపూడి అనితకు కృతజ్ఞతలు తెలిపారు.

### మైసూరు ఉత్సవాల తరహాలో గుర్తింపు

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. విజయవాడ ఉత్సవ్‌ను విజయవంతం చేసేందుకు ఎంపీ కేశినేని చిన్ని చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహకారంతో ఈ వేడుకలు మరింత గుర్తింపు పొందుతున్నాయని తెలిపారు. విజయవాడ దసరా ఉత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు మైసూరు ఉత్సవాల తరహాలో దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందే అవకాశముందని అభిప్రాయపడ్డారు. ఈ నగరానికి ప్రజలే అసలైన బ్రాండ్ అంబాసిడర్లని పేర్కొన్నారు.

### సరస్ మేళాతో చిరు వ్యాపారులకు ఊతం

విజయవాడ ఉత్సవ్‌కు జాతీయ సరస్ మేళా మరో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోందని రామ్మోహన్ నాయుడు అన్నారు. వివిధ రాష్ట్రాల మహిళా స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శించి విక్రయిస్తున్నారని తెలిపారు. ఈ




వేడుకలు సందర్శకులకు ఆహ్లాదాన్ని అందించడంతో పాటు చిరు వ్యాపారులకు ఆర్థికంగా తోడ్పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక కళాకారులు, యువత ప్రతిభకు తగిన గుర్తింపు లభించేలా ఇటువంటి వేదికలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.

### మహిళల భద్రతకు ప్రాధాన్యం

రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ.. శరన్నవరాత్రి ఉత్సవాల తరహాలో విజయవాడ ఉత్సవ్‌ను ఘనంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. నగర సంస్కృతి, వైభవాన్ని దేశానికి పరిచయం చేసేలా కార్యక్రమాలు రూపొందించిన ఎంపీ కేశినేని చిన్నిని అభినందించారు. మహిళల భద్రత, గౌరవం, సాధికారతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామమోహన్, కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి, దూండి రాకేష్ బేగ్, తేజస్వి, గద్దె అనురాధ, సామినేని ఉదయభాను, బుద్ధా వెంకన్న తదితరులు పాల్గొన్నారు. నగర ప్రజలు, రాష్ట్రంలోని పర్యాటకులు పెద్దఎత్తున పాల్గొని విజయవాడ ఉత్సవ్--2.0ను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

# పబ్బులు, బార్లలో బరితెగింపు

**ఎంఆర్‌పీ కంటే అధిక ధరలు..**

**అనుమతుల్లేకుండానే నిర్వహణ**

**విశాఖలో 31 బృందాలతో పోలీసుల మెరుపు తనిఖీలు**

**ఫైర్ సేఫ్టీ, పార్కింగ్, ఎల్‌పీజీ వినియోగంలోనూ లోపాలు**






విశాఖపట్నం(ప్రశ్న న్యూస్) పబ్బులు, బార్ అండ్ రెస్టారెంట్లలో నిబంధనల ఉల్లంఘనలపై విశాఖ నగర పోలీసులు కొరడా ఝళిపించారు. ఎంఆర్‌పీ కంటే అధిక ధరల వసూళ్లు, తప్పనిసరి లైసెన్సుల కొరత, అగ్నిమాపక భద్రతా లోపాలు, వాణిజ్య వంటశాలల్లో గృహ వినియోగ ఎల్‌పీజీ సిలిండర్ల వాడకం వంటి అంశాలను గుర్తించారు. నగర పోలీసు కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి ఆదేశాలతో శనివారం రాత్రి నగరవ్యాప్తంగా ఏకకాలంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.

### 31 బృందాలతో తనిఖీలు

మొత్తం 93 మంది పోలీసు సిబ్బందితో 31 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. పోలీసు ప్రకటన ప్రకారం బార్ అండ్ రెస్టారెంట్లు, పబ్బులు కలిపి 57 ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా లైసెన్సులు, అగ్నిమాపక భద్రత, పార్కింగ్, ధరల నియంత్రణ, పని వేళలకు సంబంధించిన నిబంధనలను పరిశీలించారు.

### ఎంఆర్‌పీకి మించి వసూళ్లు

కొన్ని సంస్థల్లో గరిష్ఠ చిల్లర ధర (ఎంఆర్‌పీ) కంటే అధికంగా ధరలు వసూలు చేస్తున్నట్లు గుర్తించారు. తప్పనిసరిగా ఉండాల్సిన ఫుడ్, ట్రేడ్, లేబర్ లైసెన్సులు లేని సంస్థలనూ గుర్తించారు. వాణిజ్య వంటశాలల్లో గృహ వినియోగ ఎల్‌పీజీ సిలిండర్ల వాడకం, అగ్నిమాపక భద్రతా అనుమతుల కొరత, పార్కింగ్ సౌకర్యాల్లో లోపాలు బయటపడ్డాయి. అనుమతించిన సమయం దాటిన తర్వాత కూడా కార్యకలాపాలు నిర్వహించినట్లు గుర్తించారు.

### లోపాలు సరిచేసుకోవాలి

గుర్తించిన ఉల్లంఘనలను సంబంధిత యాజమాన్యాల దృష్టికి తీసుకెళ్లి, లోపాలను సరిచేసుకోవాలని పోలీసులు ఆదేశించారు. నిబంధనలు, లైసెన్స్ షరతులు ఉల్లంఘించిన సంస్థలపై సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకొని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.పబ్బులు, బార్ అండ్ రెస్టారెంట్ల నిర్వాహకులు చెల్లుబాటయ్యే లైసెన్సులు కలిగి ఉండటంతోపాటు అగ్నిమాపక భద్రత, పార్కింగ్, ధరల నియంత్రణ, పని వేళల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు. అక్రమ కార్యకలాపాలు లేదా నిబంధనల ఉల్లంఘనలు కనిపిస్తే సీపీ వ్యక్తిగత నంబరు 7995095799కు లేదా సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# ఏమీ చేయలేకే గతాన్ని తవ్వుతారు!

'మనల్ని విమర్శించడానికి ఏమీ దొరకనప్పుడు మన గతాన్ని వెలికితీస్తారు. చవకబారు ఆరోపణలు చేసి ఏదో సాధించామని సంబరపడిపోతారు. నా విషయంలో అదే జరిగింది. ఎవరితోనైనా ప్రేమగా మాట్లాడినా, చిరునవ్వుతో పలకరించినా లవ్‌ఎఫైర్ అంటూ ప్రచారం చేశారు. నా స్నేహితుల దగ్గరి నుంచి ప్రేమించే వ్యక్తుల వరకూ.. ప్రతి ఒక్కరిని పరిచయం చేయడానికి నేను ఇష్టపడతాను. ఎప్పటికప్పుడు నా సినిమా విశేషాలను పంచుకుంటూ సోషల్‌మీడియాలో చురుగ్గా ఉంటాను. ఇంత ఓపెన్‌గా ఉంటున్నప్పటికీ నా మీద ఎందుకు పుకార్లు వ్యాప్తి చేస్తారో అర్థం కాదు. కొన్నిసార్లు వారి వినోదం కోసం వ్యక్తిగత జీవితాలను టార్గెట్ చేస్తుంటారు' అని మృణాల్ ఠాకూర్ చెప్పుకొచ్చింది. ఆమె తాజా చిత్రం 'పూజా మేరీ జాన్' ఇటీవలే ఓటీటీలో ప్రేక్షకుల ముందుకొచ్చింది.





# గాయనిగా మారిన ఊర్వశి రౌతేలా..

## తొలి ఈడీఎం సింగర్ గా ఘనత!

బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా తనలోని మరో కొత్త ప్రతిభను బయటపెట్టారు. నటిగా ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆమె, ఇప్పుడు గాయనిగా కొత్త అవతారం ఎత్తారు. 'హార్ట్ కంట్రోలర్' పేరుతో ఎలక్ట్రానిక్ డ్యాన్స్ మ్యూజిక్ (ఈడీఎం) ట్రాక్‌తో సంగీత ప్రపంచంలోకి అడుగుపెట్టారు. విశేషమేమిటంటే, ఈ పాటకు ఆమె స్వయంగా గాత్రం అందించడమే కాకుండా, సాహిత్యం కూడా సమకూర్చారు.ఈ సందర్భంగా ఊర్వశి తన సంగీత ప్రయాణం గురించి మాట్లాడుతూ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. "ఎలక్ట్రానిక్ డ్యాన్స్ మ్యూజిక్ అంటే నాకు ఎప్పటినుంచో ఆసక్తి ఉంది. ఒక నటిగా నా ఇమేజ్‌కు అదనంగా కాకుండా, ఈ సంగీతంలోనే ఒక గాయనిగా, రచయిత్రిగా నన్ను నేను చూసుకోవాలనుకున్నాను. బాలీవుడ్ చరిత్రలోనే పూర్తి స్థాయి ఈడీఎం పాటను ఆలపించిన తొలి ప్రధాన గాయనిని నేనే కావడం గర్వంగా ఉంది" అని ఆమె తెలిపారు.ఈ పాట టైటిల్ వెనుక ఉన్న అర్థాన్ని కూడా ఊర్వశి వివరించారు. "'హార్ట్ కంట్రోలర్' అనే పదం నా పేరు 'ఊర్వశి' నుంచే వచ్చింది. ఇందులో 'ఉర్' అంటే హృదయం, 'వశి' అంటే నియంత్రించేది. అందుకే ఈ పేరు పెట్టాను. ఈ పాటలో నేను మరో మహిళ గురించి పాడటం లేదు, నా గురించే పాడుకుంటున్నాను" అని ఆమె స్పష్టం చేశారు. ఈ పాట కేవలం సంగీతం మాత్రమే కాదని, ఇందులో మహాభారత ప్రస్తావన, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు కూడా మిళితమై ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. తన ఇంటిపేరైన 'రౌతేలా'ను కూడా ఉద్దేశపూర్వకంగానే సాహిత్యంలో చేర్చినట్లు చెప్పారు.హాలీవుడ్ మ్యూజిక్ ఇండస్ట్రీకి చెందిన ప్రముఖ నిర్మాతలు అస్లాన్, తైమూర్ జానా, ఓరియంటల్ హౌస్‌తో కలిసి ఈ పాటను రూపొందించినట్లు ఆమె తెలిపారు. ఇప్పటికే పాట విన్నవారు మంచి స్పందన ఇస్తున్నారని, ఇకపై ఈ పాట తనది మాత్రమే కాదని, శ్రోతలందరిదీ అని ఆమె ఆనందం వ్యక్తం చేశారు.సన్నీ డియోల్ సరసన 'సింగ్ సాబ్ ది గ్రేట్' చిత్రంతో ఊర్వశి బాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత 'సనమ్ రే', 'గ్రేట్ గ్రాండ్ మస్తీ', 'హేట్ స్టోరీ 4' వంటి చిత్రాలతో పాటు 'కాబిల్' సినిమాలో ఒక ప్రత్యేక గీతంలోనూ కనిపించి గుర్తింపు తెచ్చుకున్నారు. తెలుగులోనూ బాలకృష్ణ సరసన 'డాకూ మహారాజ్' చిత్రంలో నటించారు. చిరంజీవి 'వాల్తేరు వీరయ్య' చిత్రంలో ఓ ఐటమ్ నెంబర్ లో మెరిశారు.

## విజయ్ దేవరకొండ ఫ్యాన్స్‌కు

# బిగ్ షాక్

### 'రణబాలి' డబ్బింగ్ వెర్షన్స్ విడుదల వాయిదా!



టాలీవుడ్ సెన్సేషనల్ హీరో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'రణబాలి' కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. పెళ్లి తర్వాత ఈ క్రేజీ కాంబో తెరపైకి వస్తుండటం, అటు 'టాక్సీవాలా' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత రాహుల్ సాంకృత్యాన్ -- విజయ్ కాంబినేషన్ రిపీట్ అవుతుండటంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే అనుకున్న తేదీ ప్రకారం ఈ సినిమా అక్టోబర్ 16న దసరా కానుకగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలకు సిద్ధమవుతోంది.అయితే, ఓవర్సీస్ మార్కెట్లోని ప్రేక్షకులకు, ముఖ్యంగా నాన్-తెలుగు విజయ్ ఫ్యాన్స్‌కు మేకర్స్ నుంచి నిరాశ కలిగించే అప్‌డేట్ అందింది. ఓవర్సీస్ డిస్ట్రిబ్యూటర్ల సమాచారం ప్రకారం.. అక్టోబర్ 16న విడుదల రోజున విదేశాల్లో కేవలం ఒరిజినల్ తెలుగు వెర్షన్ మాత్రమే ప్రదర్శించబడుతుంది. ఇతర భాషల డబ్బింగ్ వెర్షన్‌లకు సంబంధించిన కంటెంట్ సిద్ధం చేయడంలో ఏర్పడిన ఆలస్యం కారణంగా, వాటి రిలీజ్‌ను అక్టోబర్ 23కి వాయిదా వేశారు.

మరోవైపు, ఓవర్సీస్ మార్కెట్‌లో ఈ సినిమాకు సంబంధించి అడ్వాన్స్ బుకింగ్స్ జోరుగా సాగుతున్నాయి. ప్రముఖ థియేటర్ చైన్‌లలో ఇప్పటికే టిక్కెట్ల అమ్మకాలు ప్రారంభం కాగా, కేవలం ప్రీ-సేల్స్ ద్వారానే సినిమా 50 వేల డాలర్ల మార్కును దాటడం విశేషం. రాబోయే రోజుల్లో ప్రీమియర్ కలెక్షన్స్ ఏ స్థాయిలో ఉంటాయనేది ఆసక్తికరంగా మారింది. ప్రముఖ సంగీత ద్వయం అజయ్-అతుల్ అద్భుతమైన బాణీలు అందిస్తున్న ఈ భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో వేచి చూడాలి.

# సెట్స్‌పైకి 'శ్రీమతి'..

## షూటింగ్‌కు ముందు ఎమోషనల్ అయిన నివేదా థామస్

నటి నివేదా థామస్ తన కొత్త సినిమా చిత్రీకరణను ప్రారంభించారు. 'శ్రీమతి' పేరుతో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొనబోయే ముందు, తన అనుభూతులను ఆమె సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. కొత్త సెట్‌లో అడుగుపెట్టే ముందు ఉత్సాహంతో పాటు కాస్త నెర్వస్‌గా ఉందని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా నివేదా తన పోస్ట్‌లో, "కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధంగా ఉన్నాను. ఇది తెలిసిన ప్రపంచమే అయినా, తనదైన శైలిలో చాలా కొత్తగా, బలంగా అనిపిస్తోంది. కొత్త సెట్‌లో మొదటి రోజు షూటింగ్‌కు వెళ్లే ముందు నాలో ఒకరకమైన నెర్వస్ ఎనర్జీ ఉంటుంది. అది ఆందోళన కాదు, సినిమా మొదలుపెడుతున్నాననే ఉత్సాహం. ఒకమ్మాయి సినిమా షూటింగ్‌కు బయల్దేరింది" అని రాసుకొచ్చారు. 'శ్రీమతి' చిత్రాన్ని జీ5 తెలుగు ఒరిజినల్‌గా, ఒక ఫ్యామిలీ డ్రామాగా రూపొందిస్తున్నారు. విశ్వక్ ఖండేరావు దర్శకత్వం వహిస్తుండగా, 'హనుమాన్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాన్ని నిర్మించిన ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. 2024లో వచ్చిన '35 చిన్న కథ కాదు' సినిమాతో నివేదా థామస్ భారీ విజయాన్ని అందుకోవడమే కాకుండా, తన నటనకు గాను ఉత్తమ నటిగా ఫిలింఫేర్ అవార్డు, గద్దర్ తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర పురస్కారాన్ని కూడా గెలుచుకున్నారు. ఆ ఘన విజయం తర్వాత ఆమె నటిస్తున్న సినిమా కావడంతో 'శ్రీమతి'పై అభిమానుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి.



# చిరంజీవిగారు చెప్పినట్టే జరిగింది

'రెండున్నర గంటలపాటు హాయిగా నవ్వించాలనే ఉద్దేశంతో తీసిన సినిమా 'కామ్రేడ్ కళ్యాణ్'. లక్కీగా ఈసినిమా దసరాకు రావడం, అందరికీ సెలవులు ఉండటం సినిమాకు బాగా కలిసొచ్చింది. ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తున్నది. మౌత్ టాక్ పాజిటీవ్‌గా స్ప్రెడ్ అవ్వడంతో వసూళ్లు కూడా పెరుగుతున్నాయి' అని హీరో శ్రీవిష్ణు అన్నారు. ఆయన కథానాయకుడిగా జానకిరామ్ మారెళ్ల దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'కామ్రేడ్ కళ్యాణ్'. వెంకటకృష్ణ కర్నాటి, సీతా కర్నాటి నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలై థియేటర్లలో ప్రదర్శితమవుతున్నది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సక్సెస్‌మీట్‌లో శ్రీవిష్ణు మాట్లాడారు. 'ఈ సినిమా చూసి ఓ పెద్ద హీరో ఫోన్ చేసి, మెచ్చుకున్నారు. నెక్ట్స్ ఈవెంట్స్‌కి ఆయన గెస్ట్‌గా వస్తారు. ఈ సినిమాలో ఆచార్యదళం డైలాగ్‌కు మంచి స్పందన వస్తున్నది. చిరంజీవిగారికి ఈ సీన్ గురించి చెప్పగానే పగలబడి నవ్వారు. థియేటర్లో ఇదే హైలైట్ అవుతుందని ఆయన అన్నారు. ఆయన చెప్పినట్టే జరిగింది. రాధికగారి పాత్రకు అద్భుతమైన స్పందన వస్తున్నది. బాలకృష్ణగారి ఫ్యాన్స్ నుంచి కూడా కాల్స్ వస్తున్నాయి. ఇందులో ఓ సీరియస్ టాపిక్ ఉంది. దాన్ని ఫన్‌గా చూపించాం. అదే ఆడియన్‌కి నచ్చింది' అని శ్రీవిష్ణు చెప్పారు. ఇంకా కోన వెంకట్ కూడా మాట్లాడారు.



# తమిళ దర్శకుడితో భారీ అడ్వెంచర్?



వారిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'టాక్సిక్' సినిమా ఆశించిన స్థాయి విజయాన్ని అందుకోలేకపోయింది. ప్రస్తుతం నితీష్ తివారీ 'రామాయణం'లో రావణుడిగా నటిస్తూ యశ్ బిజీగా ఉన్నారు. రెండు భాగాలుగా ఈ సినిమా రూపొందుతు న్నది. ఈ చిత్రానికి సంబంధించిన తొలి భాగం దీపావళి కానుకగా విడుదల కానున్న విషయం తెలిసిందే.మరి 'రామాయణ' ఫ్రాంచైజీ తర్వాత యశ్ చేసే సినిమా ఏంటి? ఆయన సోలో హీరోగా ఎవరి దర్శకత్వంలో నటిస్తారు? అనే ప్రశ్నలు ఫిల్మ్ సర్కిల్స్‌లో ప్రస్తుతం చర్చనీయాంశా లుగా మారాయి. అయితే.. తాజాగా తమిళ దర్శకుడు పీఎస్ మిత్రన్ ఇచ్చిన అప్‌డేట్‌తో ఈ చర్చలకు ఫుల్‌స్టాప్ పడ్డట్టయింది.'ఇండియానా జోన్స్' తరహాలో ఒక భారీ అడ్వెంచర్ కథను ఇటీవలే యశ్‌కు వినిపించానని, యశ్ కు కూడా ఆ కథ బాగా నచ్చిం దని, 'రామాయణ' కమిట్‌మెంట్స్ పూర్త య్యాక, ఈ ప్రాజెక్ట్ వర్క్ మొదలవు తుందని మిత్రన్ చెప్పారు. ఇది యశ్ అభిమానులకు నిజంగా శుభవార్తే.

# అందుకే 'బాషా 2'కి నో చెప్పా.. 'జైలర్ 2'కు ఓకే చెప్పా: రజనీకాంత్



సూపర్‌స్టార్ రజనీకాంత్ సాధారణంగా సీక్వెల్ సినిమాలకు దూరంగా ఉంటారు. గతంలో 'బాషా 2', 'పేట 2' చిత్రాల ఆఫర్లను కూడా తిరస్కరించారు. కానీ 'జైలర్ 2' విషయంలో మాత్రం వెంటనే అంగీకరించారు. ఎందుకలా? కేవలం సినిమా విజయాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకోలేదని రజనీకాంత్ చెప్పారు. కథలోనే రెండో భాగానికి బలమైన పునాది ఉండటంతో ఓకే చెప్పానని వెల్లడించారు.'జైలర్ 2' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఆయన ఈ విషయాలను పంచుకున్నారు. సాధారణంగా మొదటి భాగంలోని కథకు కొన్ని కొత్త అంశాలు జోడించి రెండో భాగాన్ని తెరకెక్కిస్తారని తాను భావిస్తానని రజనీ తెలిపారు. అందుకే సీక్వెల్స్‌పై పెద్దగా ఆసక్తి చూపనని చెప్పారు.గతంలో 'బాషా 2'కి అంగీకరించలేదని, విజయ్ సేతుపతి పాత్రను కొనసాగిస్తూ 'పేట 2' తీయాలన్న దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు ప్రతిపాదనను కూడా తిరస్కరించానని గుర్తు చేసుకున్నారు.'జైలర్' సినిమా ఓటీటీలో విడుదలైన తర్వాత మరోసారి చూశానని రజనీకాంత్ చెప్పారు. అప్పుడు సీక్వెల్ ఆలోచనపై తన అభిప్రాయం మారిందన్నారు. క్లైమాక్స్‌లో విగ్రహాల స్మగ్లర్ వర్మ చనిపోయే ముందు జైలర్ ముత్తువేల్ పాండియన్‌ను ఓ పెద్ద నెట్‌వర్క్ గురించి హెచ్చరిస్తాడు. ఆ నెట్‌వర్క్ గురించి సినిమా అంతటా దర్శకుడు నెల్సన్ చిన్నచిన్న సంకేతాలు ఇచ్చాడని రజనీ వివరించారు.అంతేకాదు.. రూ.వేల కోట్ల విలువైన మూడు కంటైనర్లు జైలర్ దగ్గర ఉండటం, నాగ్‌పూర్ జైలులో పనిచేసిన సమయంలోనే కరుడుగట్టిన రౌడీలు, దాదాల్లో ముత్తువేల్ పాండియన్‌పై భయం, గౌరవం ఉండటం వంటి అంశాలు రెండో భాగానికి సహజమైన పునాదిగా అనిపించాయని చెప్పారు.ఈ అంశాలన్నీ గుర్తించిన తర్వాత తానే దర్శకుడు నెల్సన్‌కు ఫోన్ చేసి 'జైలర్ 2'కి అంగీకరించినట్లు రజనీకాంత్ వెల్లడించారు. కేవలం కమర్షియల్ విజయాన్ని ఆశించి కాకుండా, కథకు కొనసాగింపు ఉండటమే తన నిర్ణయానికి కారణమని స్పష్టం చేశారు.సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మించిన ఈ చిత్రంలో విద్యాబాలన్, మిథున్ చక్రవర్తి, ఎస్‌జే సూర్య, సూరజ్ వెంజరమూడు కీలక పాత్రల్లో నటించారు. మోహన్‌లాల్, శివ రాజ్‌కుమార్ ప్రత్యేక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమా అక్టోబరు 15న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## జిల్లా దశాబ్ది ఉత్సవాలు.

### కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం



ఎల్లారెడ్డిపేట(ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా ఏర్పాటై పదేళ్లు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో దశాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. బీఆర్ఎస్ ఎల్లారెడ్డిపేట మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ఏర్పాటు, అభివృద్ధిలో కేసీఆర్, కేటీఆర్ పాత్రను నాయకులు ప్రస్తావించారు. జిల్లా ఏర్పాటుతో ప్రజలకు పాలన మరింత చేరువైందని తెలియజేస్తూ, పదేళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకుని చిత్రపటాలకు పాలాభిషేకం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడు, పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సర్పంచులు అందె సుభాష్, ఎనుగందుల నరసింహులు, సోమారపు శరవిందు, టౌన్ అధ్యక్షుడు ఎడ్ల సందీప్, మండల మహిళా అధ్యక్షురాలు అప్సరున్నిస, ఎల్సాని మోహన్ కుమార్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లా ఉద్యమ గాయకులు కులేరి కిషోర్ కుమార్, నక్క శ్రీకాంత్‌లకు సన్మానం



సిరిసిల్ల(ప్రశ్న న్యూస్) జిల్లా సాధన ఉద్యమంలో తమ పాటలతో ప్రజలను చైతన్యపరిచిన ఉద్యమ గాయకులు కులేరి కిషోర్ కుమార్, నక్క శ్రీకాంత్‌లను బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు.రాజన్న సిరిసిల్ల జిల్లా ఏర్పడి పదేళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లా సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కళాకారులను గుర్తుచేసుకుంటూ ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన కులేరి కిషోర్ కుమార్, బోనాల గ్రామానికి చెందిన నక్క శ్రీకాంత్ జిల్లా ఉద్యమ సమయంలో తమ పాటలతో ప్రజల్లో చైతన్యం నింపారని నాయకులు అన్నారు.జిల్లా సాధన కోసం సాగిన ఉద్యమంలో కళాకారులు తమ గళాన్ని వినిపిస్తూ ప్రజలను ఏకతాటిపైకి తీసుకురావడంలో భాగస్వాములయ్యారని తెలిపారు. జిల్లా దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఉద్యమ గాయకులను సన్మానించడం ద్వారా వారి సేవలను గుర్తుచేసుకున్నారు.

## రాజన్న సిరిసిల్ల జిల్లా దశాబ్ది వేడుకల్లో డీసీసీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్



సిరిసిల్ల(ప్రశ్న న్యూస్) జిల్లా ఆవిర్భవించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన దశాబ్ది వేడుకల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి విడిపోయి ప్రత్యేక జిల్లాగా ఏర్పడిన రాజన్న సిరిసిల్ల జిల్లా పదేళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వేడుకల్లో భాగంగా సిరిసిల్లలోని గాంధీ చౌక్ వద్ద ఆయన కేక్ కట్ చేసి సంబరాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు దశాబ్ది ఉత్సవాల శు భాకాంక్షలు తెలిపారు. పదేళ్ల జిల్లా ప్రస్థానంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలను గుర్తుచేసుకుంటూ జిల్లా మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. జిల్లా అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం, సంక్షేమ కార్యక్రమాల ప్రాధాన్యాన్ని ఈ వేడుకలు చాటిచెప్పాయని అన్నారు.

## కండ్ల కోయలో ఘనంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) గుండ్ల పోచంపల్లి డివిజన్ కండ్ల కోయలో ఘనంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. కండ్లకోయ పట్టణంలో కులాలకతీతంగా, రాజకీయాల కతీతంగా కండ్లకోయ మాజీ సర్పంచ్ కందాడి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ రాజేందర్ ముదిరాజ్ ఏర్పాటు చేసిన అమ్మవారి ని పూజించినవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. డివిజన్ ప్రజలు సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం పెద్దలు టీ పెంటేష్ ముదిరాజ్ రామకృష్ణ, బిక్షపతి, మల్లేష్ గౌడ్ యాదయ్య టి.శ్రీనివాస్ ముదిరాజ్ వై రాజు మత్స్యకార సంఘం అధ్యక్షులు శ్రీకాంత్ ముదిరాజ్ శివ ముదిరాజ్ భవాని మాల దారులు భక్తులు గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ మద్దుల శ్రీనివాస్ రెడ్డి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు సంజీవ్ గౌడ్ , బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు జగన్ రెడ్డి 299 కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు సురేందర్ ముదిరాజ్ , మాజీ అధ్యక్షులు సాయిపేట శ్రీనివాస్ యాదవ్, జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షులు గువ్వ రవి ముదిరాజ్ , 299 డివిజన్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సాకర బోయిన మల్లేష్ ముదిరాజ్ గుండ్ల పోచంపల్లి మాజీ సర్పంచ్ భేరి ఈశ్వర్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భానుచందర్ మరియు పార్టీ సీనియర్ నాయకులు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు

# నవరాత్రుల రెండో రోజు.. బ్రహ్మచారిణి అమ్మవారి అవతారం విశిష్టత

**తపస్సుకు ప్రతిరూపంగా ఆదిశక్తి.. భక్తులకు సహనం, సంకల్పబలం ప్రసాదించే అమ్మవారు**

ప్రశ్న న్యూస్ ప్రత్యేక కథనం మేడ్చల్ ప్రతినిధి చిన్న

నవరాత్రి ఉత్సవాల్లో రెండో రోజు బ్రహ్మచారిణి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తారు. దుర్గాదేవి నవదుర్గలలో రెండో రూపమైన బ్రహ్మచారిణి అమ్మవారు తపస్సు, త్యాగం, సహనం, నియమ నిష్ఠలకు ప్రతీకగా పూజలందుకుంటారు. జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా లక్ష్యాన్ని వదలకుండా ముందుకు సాగాలనే సందేశాన్ని అమ్మవారి అవతారం అందిస్తుంది.

### బ్రహ్మచారిణి అనే పేరు వెనుక అర్థం ఏమిటి?

'బ్రహ్మ' అంటే పరమసత్యం, ఆధ్యాత్మిక జ్ఞానం అని అర్థం చేసుకోవచ్చు. 'చారిణి' అంటే ఆ మార్గంలో నడిచే వ్యక్తి. అందువల్ల బ్రహ్మచారిణి అంటే తపస్సు, నియమం, ఆధ్యాత్మిక సాధన మార్గంలో నడిచే దేవి అని భావిస్తారు. పార్వతీదేవి శివుడిని భర్తగా పొందేందుకు కఠోర తపస్సు చేసిన రూపమే బ్రహ్మచారిణి అమ్మవారిగా పురాణాల్లో వర్ణించబడింది.

### అమ్మవారి అవతారం వెనుక పురాణ గాథ

పురాణ కథనాల ప్రకారం, హిమవంతుని కుమార్తెగా జన్మించిన పార్వతీదేవి పరమశివుడిని భర్తగా పొందాలని సంకల్పించుకుంది. ఇందుకోసం ఆమె ఎన్నో సంవత్సరాలు కఠోరమైన తపస్సు చేసినట్లు చెబుతారు. మొదట ఫలాలు, ఆకులు తీసుకుంటూ తపస్సు చేసి, అనంతరం వాటిని కూడా విడిచిపెట్టి అత్యంత కఠినమైన నియమాలతో సాధన కొనసాగించినట్లు పురాణ గాథలు వివరిస్తాయి. ఆమె అచంచలమైన సంకల్పం, అపారమైన సహనం, భక్తి కారణంగా బ్రహ్మచారిణి రూపం విశిష్టతను సంతరించుకుంది.ఈ కథ మనిషి జీవితంలో లక్ష్యసాధనకు పట్టుదల, ఓర్పు, క్రమశిక్షణ ఎంత అవసరమో తెలియజేస్తుంది.

### బ్రహ్మచారిణి అమ్మవారి రూప విశిష్టత

బ్రహ్మచారిణి అమ్మవారు తెల్లని వస్త్రాలు ధరించి, ప్రశాంతమైన ముఖంతో దర్శనమిస్తారు. ఒక చేతిలో జపమాల, మరో చేతిలో కమండలం ధరించి ఉంటారు. జపమాల నిరంతర సాధనకు, కమండలం త్యాగానికి, నియమబద్ధమైన జీవితానికి ప్రతీకలుగా భావిస్తారు. ఆమె రూపం ఆధ్యాత్మిక చింతన, మనోనిగ్రహం, ప్రశాంతతను ప్రతిబింబిస్తుంది.

### రెండో రోజు పూజల విశిష్టత

నవరాత్రుల రెండో రోజున భక్తులు బ్రహ్మచారిణి అమ్మవారిని పూజిస్తూ దీపారాధన, పుష్పార్చన, నైవేద్యాలు సమర్పిస్తారు. కొందరు ఉపవాసం పాటిస్తూ అమ్మవారి నామస్మరణ, ప్రార్థనలు, ధ్యానంలో పాల్గొంటారు. సంప్రదాయాలను అనుసరిస్తూ కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహిస్తారు.బ్రహ్మచారిణి అమ్మవారి ఆరాధనతో మనసుకు ప్రశాంతత, పనులపై ఏకాగ్రత, కష్టాలను ఎదుర్కొనే ధైర్యం లభిస్తాయని భక్తుల విశ్వాసం.

### నేటి జీవితానికి అమ్మవారి సందేశం

నేటి వేగవంతమైన జీవితంలో చిన్న చిన్న అడ్డంకులకే నిరాశ చెందడం, లక్ష్యాల నుంచి పక్కకు తప్పుకోవడం సాధారణంగా కనిపిస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో బ్రహ్మచారిణి అమ్మవారి అవతారం మనకు విలువైన సందేశాన్ని అందిస్తుంది. విజయం ఒక్కరోజులో సాధ్యమయ్యేది కాదు. దానికి నిరంతర కృషి, సహనం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం అవసరం.విద్యార్థులు చదువులో ఏకాగ్రతను పెంపొందించుకోవడం, యువత తమ లక్ష్యాల సాధనకు కృషి చేయడం, కుటుంబ సభ్యులు ఓర్పుతో సమస్యలను పరిష్కరించుకోవడం వంటి అంశాలకు ఈ అవతారం స్ఫూర్తినిస్తుంది.



### భక్తి, సహనం, సంకల్పానికి ప్రతీక

బ్రహ్మచారిణి అమ్మవారి ఆరాధన కేవలం ఆచార వ్యవహారం మాత్రమే కాదు.. మనలోని మంచితనాన్ని, ఆత్మవిశ్వాసాన్ని, పట్టుదలను పెంపొందించుకోవడానికి ఒక ఆధ్యాత్మిక ప్రేరణ. మన లక్ష్యం ఎంత కష్టమైనదైనా సరైన మార్గంలో, నిబద్ధతతో కృషి చేస్తే ముందుకు సాగవచ్చనే నమ్మకాన్ని ఈ అవతారం కలిగిస్తుంది.నవరాత్రుల రెండో రోజున బ్రహ్మచారిణి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తూ ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో సహనం, సత్యనిష్ఠ, క్రమశిక్షణను అలవర్చుకోవాలని కోరుకుందాం. అమ్మవారి కృపతో ప్రతి ఇంటా సుఖశాంతులు, సంతోషం, సౌభాగ్యం వెల్లివిరియాలని ప్రార్థిద్దాం.

# సిరిసిల్ల అభివృద్ధిలో కేసీఆర్, కేటీఆర్‌ల పాత్ర చిరస్మరణీయం

**- బీఆర్ఎస్ దశాబ్ది సంబరాలు ఘనంగా నిర్వహణ - తెలంగాణ ఉద్యమకారులకు ఘన సన్మానం**







సిరిసిల్ల(ప్రశ్న న్యూస్) జిల్లా రూపురేఖలు మారడంలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వం, మాజీ మంత్రి కేటీఆర్ కృషి కీలకమని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో పార్టీ పోషించిన పాత్రను, పదేళ్ల పాలనలో సిరిసిల్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను స్మరించుకుంటూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో దశాబ్ది సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, తెలంగాణ ఉద్యమ అమరవీరులకు నివాళు లర్పించారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులను ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో భాగంగా తెలంగాణ తల్లి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, నేతన్న విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు చేసిన పోరాటాలను, వారి త్యాగాలను నాయకులు గుర్తుచేసుకున్నారు.

### నేతన్నల కన్నీళ్ల నుంచి సిరుల సిరిసిల్ల వరకు

ఒకప్పుడు చేనేత కార్మికుల కష్టాలు, ఆత్మహత్యలతో వార్తల్లో నిలిచిన సిరిసిల్లకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంలో కేటీఆర్ విశేష కృషి చేశారని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ నాయకత్వంలో, కేటీఆర్ ప్రత్యేక చొరవతో సిరిసిల్ల అభివృద్ధికి కొత్త దిశ లభించిందని తెలిపారు. చేనేత రంగాన్ని బలోపేతం చేయడం, నేతన్నల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడం, వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి అవకాశాలు కల్పించడం ద్వారా ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు వచ్చిందని అన్నారు. సిరిసిల్ల అభివృద్ధి అంటే కేవలం రహదారులు, భవనాల నిర్మాణమే కాదని, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడం, నేతన్నల్లో భవిష్యత్తుపై నమ్మకాన్ని పెంపొందించడం కూడా అభివృద్ధిలో భాగమని నాయకులు వివరించారు.

విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు, పట్టణాభివృద్ధి, పారిశ్రామిక రంగాల్లో సిరిసిల్లకు కొత్త గుర్తింపు తీసుకురావడానికి కేటీఆర్ కృషి చేశారని కొనియాడారు.

### పదేళ్ల ప్రగతి ప్రస్థానాన్ని స్మరించుకుంటూ.

బీఆర్ఎస్ పాలనలో సిరిసిల్లలో చోటుచేసుకున్న అభివృద్ధి మార్పులు, అమలైన సంక్షేమ కార్యక్రమాలు ఈ ప్రాంత ప్రజలకు సుపరిచితమని నాయకులు అన్నారు. సిరిసిల్లను రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేకంగా గుర్తించే స్థాయికి తీసుకెళ్లడంలో కేసీఆర్, కేటీఆర్‌ల పాత్ర ఉందని తెలిపారు. గత పదేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను, వాటి ద్వారా ప్రజలకు కలిగిన ప్రయోజనాలను భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు చేసిన త్యాగాలను మరచిపోకూడదని, వారి పోరాటాల ఫలితంగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని అన్నారు. ఉద్యమకారులను సన్మానించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. సిరిసిల్ల అభివృద్ధికి కేసీఆర్, కేటీఆర్ చేసిన సేవలను గుర్తుచేసుకుంటూ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

సిరిసిల్ల ప్రజలతో కేటీఆర్‌కు ప్రత్యేక అనుబంధం ఉందని, ఈ ప్రాంత అభివృద్ధికి ఆయన చేసిన కృషిని ప్రజలు గుర్తుంచుకుంటారని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. నేతన్నల సమస్యల నుంచి అభివృద్ధి, పరిశ్రమలు, ఉపాధి అవకాశాల వరకు సిరిసిల్ల సాగించిన ప్రస్థానం తెలంగాణ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి, బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు తుల ఉమ, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, చిక్కాల రామారావు, గూడూరి ప్రవీణ్, జేఏసీ చైర్మన్లు ఆకునూరి శంకరయ్య, రమాకాంత్‌తో పాటు జిల్లా, మండల స్థాయి ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# సెయింట్ పీటర్స్‌లో ఘనంగా రోజమ్మ మెమోరియల్ క్రీడా సంబరాలు

### జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ - విజేతలకు బహుమతుల ప్రదానం

మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) మైసమ్మ గూడా లోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో అక్టోబర్ 9, 10 తేదీల్లో నిర్వహించిన రోజమ్మ మెమోరియల్ స్పెక్ అతలేటిస్ –2కే 26 జాతీయ స్థాయి ఇంటర్ ఇంజినీరింగ్ కళాశాలల క్రీడా సంబరాలు విజయవంతంగా ముగిశాయి. వివిధ కళాశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు, సైబరాబాద్ ఏసీపీ ఎ. వేణుగోపాల్ హాజరయ్యారు. ముగింపు వేడుకలకు అథ్లెట్ రాహుల్ పొన్నం ముఖ్య అతిథిగా విచ్చేసి విజేతలకు బహుమతులు, ట్రోఫీలు అందజేశారు.కళాశాల సెక్రటరీ టి.వి. రెడ్డి ఆధ్వర్యంలో, డైరెక్టర్లు టి. సరోజా రెడ్డి, టి. అనురాగ్ రెడ్డి సహకారంతో, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. వెంకటరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసన్న కుమార్ మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కె. వెంకట నారాయణ నేతృత్వంలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం, అధ్యాపకులు, సిబ్బంది, కోచ్‌లు, రిఫరీల సమన్వయంతో క్రీడా సంబరాలు విజయవంతమయ్యాయి. సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.



# బోయిన్ పల్లి మార్కెట్‌లో “ఖాళీ కూర్చి”తో సేవలు

- “10”రోజులు గడుస్తున్నా, ఉన్నత శ్రేణి అధికారి జాడలేదు
- రాష్ట్రంలో రైతుల బాధలు రెవెన్యూ అధికారులే కాదు,వ్యవసాయ మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారులు సైతం చిన్న చూపు చూస్తున్నారు
- అన్నదాత ఉత్పత్తులకు గ్యారంటీ లేని మార్కెటింగ్,
- అంతా మోసమే, వ్యవసాయ శాఖలో ఉన్నతాధికారులు మార్కెట్ యార్డులకు “టూరిజం స్పాట్”కి వస్తున్నారు, పోతున్నారు
- పాలకులు అంతే, అధికారులు ఇంతే అంటున్న మార్కెట్ వర్గాలు
- “ఎల్ నినో” తో బాధలు సరిపోక,మార్కెట్ యార్డుల్లో కొత్త సమస్యలు
- బోయిన్ పల్లి మార్కెట్ లో మౌళిక సమస్యలతో రైతే కాదు,అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు
- కోట్ల రూపాయల ఆదాయాన్ని సమకూర్చే మార్కెట్ లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో దుమ్మెత్తి పోస్తున్నారు ఖరీదు దారులు
- ఆసియాలోనే అతిపెద్ద మార్కెట్,అదే స్థాయిలో సమస్యలు,దూరప్రాంతాల నుంచి వస్తున్న భారీ వాహనాల డ్రైవర్లు తిట్ల దండకం ఎత్తుకోవడం విశేషం




**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ ఆసియాలోనే అతిపెద్ద కూరగాయల మార్కెట్.ప్రతి రోజు “27 వెయ్యిల నుంచి 31 వెయ్యిల టన్నుల కూరగాయల దిగుమతి అవుతున్నాయి.అలాగే ఏటా సుమారు 14 కోట్ల రూపాయల ఆదాయాన్ని సమకూర్చే మార్కెట్ యార్డు.వ్యవసాయ మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారులు”2001 డిసెంబర్ 20 న మోండ మార్కెట్ నుంచి విడిపోయిన తరువాత వ్యాపార వర్తకులకు”ఓనర్ షిప్”తో కలిగిన షాపులు “175” కేటాయించిన విషయం అందరికి తెలిసిందే.దీనికి తోడు గ్రీన్ మార్కెట్స్ దుకాణాలు కూడా మరికొందరికి లైసెన్స్ లు అందజేశారు.మొదట్లో బోయిన్ పల్లి మార్కెట్ లో సర్వే నెంబర్ 81, 82 పీ లో సుమారు”23”ఎకరాల భూమిని మార్కెట్ యార్డునీ అందుబాటులోకి తీసుకు వచ్చిన మార్కెటింగ్ డిపార్ట్మెంట్.అప్పుడు ప్రతి పది నుంచి పదిహేను షాపులకు మరుగు దొడ్లు, నలఫ్ఫై,వంద అడుగుల విస్తీర్ణంలో రోడ్లు, మార్కెట్ మధ్యలో”రౌండ్ బిల్డింగ్”, విశాలమైన పార్కింగ్, మంచినీటి సరఫరా కేంద్రాలు,పచ్చదనంతో కళకళలాడే కూరగాయల మార్కెట్. గతంలో బోయిన్ పల్లి మార్కెట్ నుంచి

### “మ్యూచివల్ అండర్స్టాండిగ్” పై అధికారులు బదిలీ..

డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ సెక్రటరీ ఎం.వేంకన్న మార్కెట్ లో ఒత్తిడి ఎక్కువ అవుతున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల వద్ద మోర పెట్టుకోవడంతో మిర్యాలగూడ మార్కెట్ లో విధులు నిర్వహిస్తున్న ఈ.వేంకటేశంతో చర్చించిన తర్వాత ఇద్దరు “మ్యూచువల్ అండర్స్టాండి”తో మారినట్లు విశ్వసనీయ సమాచారం.ఐదు నెలల పాటు విధులు నిర్వహించి క్రితం నెల రిటైర్మెంట్ అయిన ఈ.వెంకటేశం.ఇంత దాక బాగున్నది,కానీ ప్రస్తుతం బోయిన్ పల్లి మార్కెట్ యార్డులో”ఉన్నత శ్రేణి అధికారి”లేక”ఖాళీ కుర్చీ”తో సేవలు అందిస్తున్నారు కింది స్థాయి అధికారులు.సాధరణ బదిలీ కాదు అయిన కూడా ఇప్పటి వరికి “మ్యూచువల్ అండర్స్టాండిగ్”వల్ల వెళ్లిన అధికారి తిరిగి రిపోర్ట్ చేయకపోవడం, విశ్వసనీయ సమాచారం మేరకు ఆ అధికారి బోయిన్ పల్లి మార్కెట్ యార్డుకు రావడానికి ససేమిరా అంటున్నట్లు సమాచారం. మరి ఉన్నతాధికారులు చోద్యం చూస్తున్నారా అంటూ నిలదీస్తున్నారు అన్నదాతలు.అసలే “ఎల్ నినో”తో పంటలు సాగు చేయక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తెలంగాణలో పలు జిల్లాల్లో రైతన్నలు.బోయిన్ పల్లి మార్కెట్ యార్డుకు అక్టోబర్,నవంబర్, డిసెంబర్,జనవరి ఈ నాలుగు మాసాలు లోకల్ మాల్ ఎక్కువగా దిగుమతి అవుతుంది.

కానీ ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో లక్ష ఎకరాల్లో పంట పండాల్సినాది తక్కువ మోతాదులో దిగుమతి అవుతున్న విషయం వ్యవసాయ మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారులకు తెలిసిందే.విషయం ఏమిటంటే లోకల్ మాల్ రావాల్సిన సమయంలో ఇతర రాష్ట్రాల నుంచి కూరగాయలు దిగుమతి అవ్వడమే కాకుండా ధరలు ఆకాశాన్ని తాకడంతో లబో దిబో మంటున్నారు నగర ప్రజలు.దీనికి తోడు మార్కెటింగ్ అధికారుల నిర్లక్ష్యం వల్ల పలు సమస్యలు అధికమవుతున్నాయని వారు వాపోతున్నారు.

### యార్డులో చేతివాటం చూపుతున్న సిబ్బంది..

డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లోనే కాదు రాష్ట్రంలో ఉన్న “167”మార్కెట్ యార్డుల్లో స్థాయి మరిచి అధికారులు, సిబ్బంది చెతి వాటం లక్షల్లో
వసూలు చేస్తున్నట్లు సమాచారం.? సమాజంలో పంటలు సాగు చేస్తున్నరైతన్న మాత్రం రోజు రోజుకీ ఆర్థికంగా ఇబ్బందులకు గురి అవుతుంటే.“వ్యవసాయ మార్కెటింగ్ డిపార్ట్మెంట్”లో కొందరు అధికారులు మాత్రం కోట్లకు పడగలేత్తుతున్నారు.వీరి పట్ల చూసి చూడనట్లు ఉన్నతాధికారులు వ్యవహరిస్తున్నారా ?లేక
విజిలెన్స్ అధికారులు చూసుకుంటారనే ఆలోచనలో ఉన్నారా అనే విషయం అర్థం కావడం లేదని మార్కెట్ వర్గాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

### వ్యవసాయ శాఖలో అధికారుల హోదాలు..

వ్యవసాయ మార్కెటింగ్ డిపార్ట్మెంట్ లో అధికారుల హోదాలు.వ్యవసాయ డైరెక్టర్,ప్రిన్సిపల్ సెక్రటరీ (ఐఏఎస్ అధికారి), మార్కెటింగ్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్, అడిషనల్ డైరెక్టర్, జాయింట్ డైరెక్టర్ ఇంత పెద్ద వ్యవస్థ ఉన్నప్పటికి డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ కి మాత్రం చూట్టం చూపుగా ఉన్నతాధికారులు వస్తున్నారు తప్ప యార్డులో నెలకొన్న మౌళిక సమస్యలు పై ఏ స్థాయి అధికారి సైతం ఇప్పటి వరికి సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్న దాఖలాలు లేవు.పాపం అభం శు భం తెలియని రైతులు,ఖరీదు దారులు, హమాలీలు సామాన్య ప్రజలు ఇబ్బందులకు గురవుతున్న విషయం అందరికి తెలిసినా కూడా ఏ ఒక్కరు అభివృద్ధి వైపు అడుగులు వేసిన దాఖలాలు లేవు.

### వ్యవసాయ డైరెక్టర్ ప్రిన్సిపల్ సెక్రటరీ మౌనం వీడాలి..

డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ యార్డులో ఉన్నత శ్రేణి అధికారిని వేంటనే నియామకం చేయాలని మార్కెట్ వర్గాలు డిమాండ్ చేస్తున్నారు.”మ్యూచివల్ అండర్స్టాండిగ్”పై వెళ్లిన అధికారి ఎందుకు రావడం లేదు,కారణం ఏమిటి ? ఒకవేళ ఆయన బాధ్యతలు స్వీకరించకపోతే వ్యవసాయ డైరెక్టర్ ప్రిన్సిపల్ సెక్రటరీ కి విషయం వెల్లడించారు.ప్రస్తుతం బోయిన్ పల్లి మార్కెట్ యార్డు నుంచి మ్యూచివల్ అండర్స్టాండిగ్ “పై వెళ్లిన అధికారి ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారు? వీటి పై ప్రిన్సిపల్ సెక్రటరీ ఏమైనా ఆరా తీస్తున్నారా ? లేక వ్యవసాయ చట్టాన్ని గాలికి వదిలేశారా ? ఏదేమైనా బోయిన్ పల్లి మార్కెట్ యార్డులో”ఖాళీ కూర్చి “తో సేవలు అందించడం నిజంగా సిగ్గు పడాల్సిన విషయం.

### బోయిన్ పల్లి మార్కెట్ ని వదలని”విజిలెన్స్ అధికారులు”..,

డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ పై వరుస కథనాలు



వస్తున్ననేపధ్యంలో”వ్యవసాయ విజిలెన్స్ అధికారులు “విషయాన్ని సిరియస్ గా తీసుకున్నారు.గత కొంతకాలంగా”నిఘా “పెడుతూ,కార్యాలయంలో అనుమానం ఉన్న పలు ఫైళ్ల అవకతవకలు పై ఆరా తీస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.వర్తకులను సైతం వదలని విజిలెన్స్ అధికారులు.గేట్ ఎంట్రీ నుంచి మొదలు కొని తక్ పట్టి వరకు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.మరో విషయం ఏమిటంటే షాపులో పనులు చేస్తున్న వ్యక్తులను సైతం విచారించడం విశేషం.మరో విషయం దుకాణాలు ఎవరివి అనే కోణంలో కూడా ఆరా తీస్తున్నట్లు సమాచారం.మరీ ముఖ్యంగా యార్డులో ఉన్న గేట్ ఎంట్రీ పై ప్రత్యేకంగా దృష్టి పెట్టిన విజిలెన్స్ అధికారులు.

### బోయిన్ పల్లి మార్కెట్ లో “కూర్చి పై నాదే కర్చీఫ్”..

డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ యార్డులో పదవి విరమణ పొందిన ఈ.వెంకటేశం తర్వాత ఎవ్వరు బాధ్యతలు చేపట్టకపోవడంతో,కొందరు
“కూర్చి పై కర్చిఫ్”వేయడానికి తకతకలాడుతున్నారు. ఏకంగా సంఘం నాయకులు సైతం బోయిన్ పల్లి మార్కెట్ పై వీరు లెవెల్లో కసరత్తు.ఓ పెద్ద మనిషి ఏకంగా స్థానిక ఎమ్మెల్యే ని దర్శనం చేసుకుని సార్ మీ ఆశీస్సులు నా పై ఉంటే చాలు ఇట్టే నా సొంత అవుతుంది అంటూ మాట మాట కలుపుతూ “కుర్చీ నాదే కర్చిఫ్ నాదే నంటూ మార్కెట్ లో సాంకేతికాలు ఇచ్చారు.ఇక మరో వ్యక్తి అయితే ఓ అడుగు ముందుకేసి త్వరలో నేనే బాధ్యతలు స్వీకరిస్తునట్లు ఆయన సన్నిహితులకు సమాచారంతో పాటు రేపటి సమయం మనదే అన్నారు.ఇలా ఒకరిపై ఒకరు పోటాపోటీగా వ్యవహరిస్తున్నారంటే వీరికి ఏ పాటి శ్రద్ధ ఉందో అర్థం అవుతుందని మార్కెట్ వర్గాలు గుసగుసలాడుకుంటున్నారు.

# ఇంద్రకీలాద్రిపై ఇదేం ఏర్పాట్లు

- మాటల్లోనే సకల సౌకర్యాలు.. క్షేత్రస్థాయిలో భక్తులకు కన్నీటి కష్టాలు - వీఐపీలకు ప్రాధాన్యమా.. సామాన్యులకు గంటల నిరీక్షణా.?
- వృద్ధులు, వికలాంగుల అవస్థలు పట్టించుకునేదెవరు.? - మంచినీరు సరే.. తినడానికి ఏదీ లేదా.?
- మీడియా పాసుల పంపిణీలో గందరగోళం.. - ఘాట్ రోడ్డుపై జర్నలిస్టుల బైఠాయింపు కవరేజీ బహిష్కరణతో నిరసన..





**విజయవాడ(ప్రశ్న న్యూస్)** దసరా శరన్నవరాత్రి ఉత్సవాలంటే ఇంద్రకీలాద్రిపై ఆధ్యాత్మిక వైభవం.. భక్తుల కోలాహలం.. జగన్మాత దర్శనంతో తన్మయత్వం. లక్షలాది మంది భక్తులు తరలివచ్చే ఈ మహోత్సవాలకు ఏర్పాట్లు ఘనంగా చేశామని అధికారులు చెబుతున్నారు. తాగునీరు, క్యూలైన్లు, వైద్యసేవలు, పారిశుధ్యం.. ఇలా అన్ని సౌకర్యాలు కల్పించామని ప్రకటనలు గుప్పిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో భక్తుల నుంచి వస్తున్న ఫిర్యాదులు మాత్రం మరో చిత్రాన్ని ఆవిష్కరిస్తున్నాయి. గంటల తరబడి క్యూలైన్లలో నిరీక్షణ.. వృద్ధులు, అనారోగ్యంతో బాధపడేవారి అవస్థలు.. ఆహార సదుపాయాలపై అసంతృప్తి.. మరోవైపు మీడియా పాసుల జారీపై జర్నలిస్టుల ఆగ్రహం. ఇవన్నీ ఉత్సవాల ఏర్పాట్ల నిర్వహణపై ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే లక్ష్యమైతే, ఆ లక్ష్యం క్షేత్రస్థాయిలో ఎంతవరకు నెరవేరుతోంది.?

### నాలుగు గంటల నిరీక్షణ.. దర్శనం ఎప్పుడో.?

దసరా ఉత్సవాల తొలిరోజే అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తులు క్యూలైన్లలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు ఫిర్యాదులు అందాయి. ఉదయం ఐదు గంటలకే క్యూలోకి వచ్చినా, తొమ్మిది గంటల సమయానికి కూడా ఘాట్ రోడ్డుకు చేరుకోలేకపోయామని విశాఖ జిల్లా పెందుర్తి నుంచి వచ్చిన పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. నాలుగు గంటలకు పైగా నిరీక్షించాల్సి రావడంతో వృద్ధులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారు ఇబ్బందులు ఎదుర్కొన్నారని వారు పేర్కొన్నట్లు తెలిసింది.అమ్మవారి దర్శనం కోసం దూరప్రాంతాల నుంచి కుటుంబాలతో సహా తరలివచ్చే భక్తుల్లో చిన్నారులు, వృద్ధులు ఉంటారు. కొందరు అనారోగ్య సమస్యలతోనూ వస్తుంటారు. అలాంటివారిని గంటల తరబడి నిలబెట్టాల్సి వస్తే వారి పరిస్థితి ఏమిటి? క్యూలైన్లు ముందుకు కదలకపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఏమిటి? వృద్ధులు, వికలాంగులకు ప్రత్యేక సహాయం అందుతోందా? అన్న ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది.

### వీఐపీలకు పెద్దపీట.. సామాన్యుల సంగతేంటి.?

ఉత్సవాల నిర్వహణలో ప్రముఖుల రాకపోకలు, భద్రతా ఏర్పాట్లు సహజమే. అయితే అదే సమయంలో సాధారణ భక్తుల దర్శనానికి ఆటంకం కలగకుండా చూడటం కూడా అంతే ముఖ్యం. వీఐపీలకు ప్రాధాన్యం ఇస్తున్నారనే భావన సామాన్య భక్తుల్లో కలిగితే, అది ఏర్పాట్లపై అసంతృప్తికి దారితీస్తుంది.
సాధారణ భక్తులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తున్నప్పుడు క్యూలైన్ల నిర్వహణను అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారా.? రద్దీ పెరిగినప్పుడు అదనపు సిబ్బందిని వినియోగిస్తున్నారా.? క్యూలైన్లలో భక్తుల కదలికలను పర్యవేక్షిస్తూ ఎక్కడైనా రద్దీ పేరుకుపోతే వెంటనే చర్యలు తీసుకుంటున్నారా.? అన్న అంశాలపై స్పష్టత అవసరం. ప్రముఖుల దర్శనాలతోపాటు సామాన్య భక్తులకూ సమయానుకూలంగా దర్శనం కల్పించడమే అధికారుల ముందున్న అసలైన పరీక్ష.

### మంచినీళ్లతోనే సరిపెడతారా.?

క్యూలైన్లలో నిరీక్షించే భక్తులకు తాగునీరు అందిస్తున్నప్పటికీ, పాలు, మజ్జిగ, బిస్కెట్లు వంటి తేలికపాటి ఆహార పదార్థాలు అందుబాటులో లేవని కొందరు భక్తులు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దర్శనం కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తే, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారికి తగిన సహాయం అవసరం.తాగునీటి పంపిణీతోపాటు అవసరమైన చోట్ల వైద్య సిబ్బంది, ప్రథమ చికిత్స, విశ్రాంతి సదుపాయాలు అందుబాటులో ఉండాలి. రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితులు తలెత్తితే వెంటనే స్పందించే వ్యవస్థ ఉండాలి. భక్తుల అవసరాలను ముందుగానే అంచనా వేసి ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత అధికారులదే. ఫిర్యాదులు వచ్చిన తర్వాతే స్పందించే విధానం కాకుండా, సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

### వృద్ధులు, వికలాంగులపై ప్రత్యేక శ్రద్ధ ఎక్కడ.?

దేవాలయానికి వచ్చే ప్రతి భక్తుడూ అమ్మవారి దర్శనం ప్రశాంతంగా చేసుకోవాలని ఆశిస్తాడు. అయితే వృద్ధులు, వికలాంగులు, నడవలేని స్థితిలో ఉన్నవారికి సాధారణ క్యూలైన్లలో ఎక్కువసేపు వేచి ఉండటం మరింత కష్టంగా మారుతుంది. వారికి ప్రత్యేక మార్గాలు, సహాయక సిబ్బంది, అవసరమైన చోట కూర్చునే సదుపాయాలు ఉన్నాయా? ఉన్నా అవి సమర్థంగా అమలవుతున్నాయా? అన్నది పరిశీలించాల్సిన అంశం.ప్రత్యేక దర్శన సదుపాయాలు కాగితాలకే పరిమితం కాకుండా అర్హులైన భక్తులకు వాస్తవంగా అందాలి. క్యూలైన్లలో ఇబ్బందులు పడుతున్నవారిని గుర్తించి సాయం చేయడానికి సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలి. వృద్ధుల ఇబ్బందులపై ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన మార్పులు చేపట్టాలి.

### మీడియా పాసులపై రగడ.. ఘాట్ రోడ్డుపై బైఠాయింపు

భక్తుల ఇబ్బందులపై ఫిర్యాదులు కొనసాగుతున్న వేళ, దసరా ఉత్సవాల కవరేజీ కోసం మీడియా పాసుల జారీ అంశం మరో వివాదానికి దారితీసింది. ఇప్పటికే పాసుల కోసం దరఖాస్తు చేసుకున్న జర్నలిస్టులకు పంపిణీలో అన్యాయం జరిగిందని కొందరు మీడియా ప్రతినిధులు ఆరోపించారు. అధికారుల సూచన మేరకు జాబితాలు



సమర్పించినప్పటికీ, అరకొరగా పాసులు జారీ చేశారని వారు వాపోయారు.జారీ చేసిన కొన్ని కార్డులు కూడా మీడియా పాయింట్ వరకే పరిమితం చేశారని, క్షేత్రస్థాయిలో ఉత్సవాల కవరేజీకి అవి సరిపోవడం లేదని జర్నలిస్టులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. పాసుల పంపిణీకి అనుసరించిన ప్రమాణాలు ఏమిటి.? ఎవరి దరఖాస్తులను పరిగణనలోకి తీసుకున్నారు.? కొందరికి పాసులు జారీ చేసి, మరికొందరికి ఎందుకు ఇవ్వలేదు.? అన్న ప్రశ్నలు తలెత్తాయి.ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి ఘాట్ రోడ్డు వద్ద జర్నలిస్టులు బైఠాయించి నిరసన తెలిపినట్లు తెలిసింది. అధికారుల తీరును నిరసిస్తూ ఉత్సవాల కవరేజీని బహిష్కరించినట్లు వారు పేర్కొన్నారు. తమ సమస్యలపై అధికారులు స్పందించి స్పష్టమైన వివరణ ఇచ్చే వరకు నిరసన కొనసాగిస్తామని చెప్పినట్లు సమాచారం.

### మీడియా గొంతు వినిపించకపోతే లోటుపాట్లు తెలిసేదెలా.?

దసరా ఉత్సవాలకు వచ్చే భక్తుల సంఖ్య భారీగా ఉన్నప్పుడు ఏర్పాట్లలో చిన్నపాటి లోపం కూడా అనేకమందికి ఇబ్బంది కలిగించవచ్చు. క్యూలైన్లలో నిరీక్షణ, తాగునీటి సరఫరా, వైద్య సహాయం, పారిశుధ్యం, రవాణా వంటి అంశాలపై మీడియా క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను వెలుగులోకి తీసుకురావడం ప్రజాప్రయోజనానికి సంబంధించిన అంశం.అయితే మీడియా పాసుల జారీ విషయంలో స్పష్టత లేకపోతే, కవరేజీకి ఆటంకాలు ఎదురైతే వివాదాలు మరింత పెరిగే అవకాశం ఉంది. భద్రతా కారణాలతో పరిమితులు విధించాల్సి వచ్చినా, వాటికి సంబంధించిన నిబంధనలను ముందుగానే ప్రకటించడం, అర్హతల ఆధారంగా పారదర్శకంగా పాసులు జారీ చేయడం అవసరం. జర్నలిస్టుల అభ్యంతరాలను సంబంధిత అధికారులు వినాలి. అదే సమయంలో భద్రతా నిబంధనలను పాటిస్తూ కవరేజీకి అనువైన విధానం రూపొందించాలి.

### ప్రకటనలకు.. వాస్తవ పరిస్థితులకు మధ్య అంతరం తగ్గేదెప్పుడు.?

భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించామని ప్రకటించడం ఒక ఎత్తయితే, అవి క్యూలైన్లలో నిలబడిన చివరి భక్తుడికి కూడా అందుతున్నాయా లేదా అన్నది నిర్ధారించుకోవడం మరో ఎత్తు. ఉత్సవాల విజయాన్ని వేదికలపై జరిగే సమీక్షలు, ప్రకటనలతోనే కొలవలేం. దర్శనం కోసం వచ్చిన భక్తులు ఎంతసేపు వేచి ఉన్నారు.? వృద్ధులు, వికలాంగులకు ఎలాంటి సహాయం అందింది.? తాగునీరు, వైద్యసేవలు సకాలంలో అందుతున్నాయా.? ఫిర్యాదులపై ఎంత వేగంగా స్పందిస్తున్నారు.? అన్న అంశాలే కీలకం.మీడియా పాసుల వివాదంపై కూడా దేవస్థానం, జిల్లా యంత్రాంగం స్పందించి వాస్తవాలను వెల్లడించాలి. భక్తుల ఇబ్బందులపై వస్తున్న ఫిర్యాదులను పరిశీలించి అవసరమైన సవరణలు వెంటనే చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers".
H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588